# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి: 12 | సంచిక: 29 | సోమవారం | 25-08-2025 | పేజీలు: 08 | వెల రూ. 3 | www.epaperjournalistdiary.com


డీజే సంస్కృతిని విడనాడండి..
స్థానిక కళాకారులను ప్రోత్సహించండి!



5లో..

# దేవుడు డిజైనర్, ప్రకృతి గురువు

## మనం మంచి స్టూడెంటా కాదా అనేది ప్రశ్న

తెలంగాణ రైజింగ్ 2047..
ట్రిలియన్ డాలర్ ఆర్థిక లక్ష్యం
లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్
రంగాల్లో హైదరాబాద్ ముందంజ
స్టార్టప్‌లు, MSMEలకు తెలంగాణ
ప్రభుత్వ ప్రోత్సాహం సీఎం రేవంత్





**హైదరాబాద్ ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ):**

హైదరాబాద్‌లో జరిగిన బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య ప్రసంగం చేశారు. జీవవిజ్ఞానం, వైద్య రంగం, ఆవిష్కరణల ప్రాధాన్యం గురించి ఆయన విశ్లేషిస్తూ తెలంగాణను ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. "దేవుడు ఒక మంచి డిజైనర్, ప్రకృతి మంచి గురువు. మనం మంచి విద్యార్థులమా కాదా అనేది ప్రశ్న," అని సీఎం రేవంత్ అన్నారు. జీవశాస్త్రం, వైద్య రంగంలో ప్రకృతినే మనకు ఉత్తమ గురువుగా తీసుకోవాలని, మనం చేసే పరిశోధనల్లో తప్పులు ..మిగతా 2లో



2

## రాహుల్ గాంధీ 'ఓట్ల చోరీ' ఆరోపణలకు రాజ్ ఠాక్రే మద్దతు!

ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కయ్యాయని రాహుల్ విమర్శ
ఈ అంశాన్ని తాను 2016-17లోనే లేవనెత్తానని చెప్పిన ఠాక్రే
ఎన్నికలను బహిష్కరించాలన్న తన సూచనను ప్రతిపక్షాలు పట్టించుకోలేదని వ్యాఖ్య
ఓటర్ల జాబితాలపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు

## కేసీఆర్‌కు మళ్లీ అస్వస్థత..

పర్యవేక్షిస్తున్న ప్రత్యేక వైద్యులు
షుగర్, సోడియం స్థాయుల్లో హెచ్చుతగ్గులు
హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందంతో చికిత్స
ఫాంహౌస్‌కు చేరుకున్న కేటీఆర్, హరీశ్ రావు ఇతర నేతలు
అవసరమైతే హైదరాబాద్‌కు తరలించే యోచన



2

## సుప్రీంకోర్టు తీర్పుతో వారిలో భయం మొదలైంది

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్
పదవులకు రాజీనామా చేసి ఉపఎన్నికల్లో గెలవాలని డిమాండ్
20 నెలల పాలనపై రేవంత్ రెడ్డి ప్రజాతీర్పు కోరాలని వ్యాఖ్య
కాంగ్రెస్ ప్రభుత్వ అప్పులు, హైడ్రా ఆగడాలపై తీవ్ర విమర్శలు
కేసీఆర్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధిని గుర్తు చేసిన కేటీఆర్
నాయకులు మోసం చేసినా కార్యకర్తలు పార్టీతోనే ఉన్నారని ప్రశంస



**హైదరాబాద్ ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ):**

బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారికి నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే తక్షణమే తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి, ఉప ఎన్నికలను ఎదుర్కొని గెలవాలని ఆయన సవాల్ విసిరారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 20 నెలల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకొని ఉప ఎన్నికలకు రావాలని, జర్నలిస్ట్ డైరీలోనే తేల్చుకుందామని కేటీఆర్ స్పష్టం చేశారు.

పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలలో ఓటమి భయం మొదలైందని కేటీఆర్ అన్నారు. అందుకే వారు రాజీనామా చేసేందుకు వెనుకాడుతున్నారని ..మిగతా 2లో

## వినాయక చవితి వేళ తియ్యని కబురు చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

గణేశ్ మండపాలకు, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్
తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
అనుమతి ఉన్న మండపాలకే ఈ సౌకర్యం వర్తింపు
ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు
వేగంగా జరుగుతున్న హైదరాబాద్ గణేశ్ మండపాల ఏర్పాటు
తుది దశకు చేరిన ప్రఖ్యాత ఖైరతాబాద్ విగ్రహం పనులు



2

## బైపోల్స్‌కి బీఆర్ఎస్ రెడీ..

జూబ్లీహిల్స్‌తో పాటు 10 చోట్ల ఉపఎన్నికలు రానున్నాయా?
సుప్రీం కోర్ట్ తీర్పును అనుకూలంగా భావిస్తున్న బీఆర్ఎస్
ఇప్పటికే కొందరు ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు?
త్వరలోనే మరికొందరికి అంటున్న గులాబీ వర్గాలు
జూబ్లీహిల్స్‌తో పాటు ఆ పది చోట్ల బైపోల్స్ అంటున్న బీఆర్ఎస్
పది నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాల కోసం అన్వేషణ
అప్పుడే గెలిచాం, ఇప్పుడు నిలబెట్టుకుంటామన్న నమ్మకం



2

## యూరియా ఇవ్వకుండా అభాండాలా?

వాస్తవాలు పక్కదారి పట్టేలా కిషన్ రెడ్డి వ్యాఖ్యలు
11 ఏళ్లుగా లేని కొరత ఇప్పుడు ఎందుకొచ్చింది?
కేంద్ర వైఫల్యాలను దాచి రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలా?
యూరియా పక్కదారి పట్టలేదన్న తుమ్మల



**హైదరాబాద్ ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ):**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో యూరియా కొరతపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చూస్తే వాస్తవాలు దాచి ఉల్టా రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివారం ఈ మేరకు మీడియా ప్రకటన విడుదల చేశారు. యూరియా సరఫరాలో జియో పాలిటిక్స్, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఎర్ర సముద్రంలో నౌకాయానం నిలవడం వల్ల యూరియా ఇంపోర్ట్ డిమాండ్‌కు తగ్గ స్థాయిలో లేదని కిషన్ రెడ్డి ఓ పక్క చెబుతూనే మరోపక్క పక్కదారి పడుతుంటే ..మిగతా 2లో

## ధరావతు కోటి చెల్లించాల్సిందే..!

భూముల వేలంలో హెచ్‌ఎండీఏ వింత విధానం
గతంలో రూ. 1లక్ష నుంచి రూ. 5లక్షల లోపే..
వడబోత పేరిట 100శాతం పెంచిన హెచ్‌ఎండీఏ
బడా సంస్థలకే ప్రయోజనం చేసేలా నిర్ణయం




**హైదరాబాద్ ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ):**

భూముల వేలం ప్రక్రియలో హెచ్‌ఎండీఏ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడూ లేనట్లుగా భూముల వేలంలో పాల్గొనేందుకు తీసుకునే ధరావతు (బయానా లేదా ఈఎండీ)ని అమాంతం పెంచేసింది. దాదాపు 100శాతం ఈఎండీని పెంచగా... వేలానికి ముందే వడపోసేలా హెచ్‌ఎండీఏ వ్యవహరిస్తోంది. దీంతో హెచ్‌ఎండీఏ ప్లాట్లు అంటేనే వేలానికి ముందే మరింత ఖరీదుగా మారిపోయాయి. ఒకేసారి భారీ ధరావతు చెల్లించాల్సి రావడంతో సాధారణ వ్యక్తులు కొనలేని పరిస్థితులు ఏర్పడనున్నాయి. వేలానికి ముందే కోట్లలో బయానాగా చెల్లించాలనే నిబంధన వలన... గతంలో మాదిరి అందరూ కొనుగోలు ..మిగతా 2లో

## అనుమానంతో భార్యను చంపి ముక్కలుగా నరికి.. మూసీలో పడేసిన కిరాతకుడు

5 నెలల గర్భిణీ అని తెలిసి కూడా దారుణం
ఏమీ ఎరుగనట్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
తమదైన స్టైల్‌లో విచారించగా నేరం అంగీకారం



3



# దేవుడు డిజైనర్, ప్రకృతి గురువు..

మొదటిపేజీ తరువాయి

చేయకుండా ముందుకు సాగాలని సూచించారు. కృత్రిమ మేధస్సు (AI) కూడా బయోడిజైన్‌కు మంచి ఉదాహరణ అని, సహజ మెదడును ఆధారంగా తీసుకుని మానవులు కృత్రిమ మెదడును సృష్టించారని తెలిపారు.

"మేము తెలంగాణ రైజింగ్ 2047 అనే ప్రయాణాన్ని ప్రారంభించాం. 2034 నాటికి తెలంగాణను $1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి $3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే ఫార్మా, బయోటెక్, లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్ రంగాల్లో దేశంలో ముందంజలో ఉందని సీఎం తెలిపారు. సుల్తాన్‌పూర్‌లో 302 ఎకరాల్లో ఏర్పాటు చేసిన దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైసెస్ పార్క్‌లో 60కి పైగా దేశీయ, అంతర్జాతీయ కంపెనీలు పనిచేస్తున్నాయని చెప్పారు. డయాగ్నస్టిక్ పరికరాలు, ఇమేజింగ్ టెక్నాలజీలు, ఇంప్లాంట్లు, శస్త్రచికిత్స పరికరాలు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్‌లో పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు.

స్థానిక స్టార్టప్‌లు, MSMEలు కూడా గ్లోబల్ కంపెనీలతో కలసి పనిచేస్తున్నాయని, ప్రభుత్వం పూర్తిగా మద్దతు ఇస్తుందని సీఎం రేవంత్ భరోసా ఇచ్చారు. అవసరమైన సహకారాన్ని అందిస్తామని, డేటా గోప్యతను కాపాడుతూ ప్రజల ఆరోగ్య సేవలకు కావాల్సిన సమాచారం అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పన్నులు, యుద్ధాలు, వాణిజ్య పరమైన అడ్డంకులు కనిపిస్తున్నప్పటికీ, ఆవిష్కరణలకు తెలంగాణే సరైన వేదిక అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "మనందరం కలసి పనిచేసి మానవాళిని మరింత ఆరోగ్యంగా మార్చడానికి కృషి చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు

# సుప్రీంకోర్టు తీర్పుతో వారిలో భయం మొదలైంది

మొదటిపేజీ తరువాయి

ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల బ్లాక్‌మెయిల్ దందాల కోసమే 'హైడ్రా' వ్యవస్థ పనిచేస్తోందని, దాని ఆగడాల వల్ల ఒకప్పుడు దేశానికే తలమానికంగా ఉన్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పు కంటే, రేవంత్ రెడ్డి కేవలం 20 నెలల కాలంలోనే ఎక్కువ అప్పులు చేశారని విమర్శించారు. అభివృద్ధి గురించి మాట్లాడే ధైర్యం రేవంత్ రెడ్డికి ఉందా అని కేటీఆర్ నిలదీశారు.

గతంలో కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టిందని కేటీఆర్ గుర్తుచేశారు. 2014లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నప్పటికీ, కేసీఆర్ నాయకత్వంలో ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. దీంతో నగరంలో ఇన్వర్టర్లు, జనరేటర్ల అవసరమే లేకుండా పోయిందన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో రాజకీయాలు చేయకుండా హైదరాబాద్‌ను అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉండేలా అభివృద్ధి చేశామని చెప్పారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ పండుగలకు సమ ప్రాధాన్యత ఇస్తూ మతసామరస్యాన్ని కాపాడామని అన్నారు. అందుకే 2023 ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వ



కుండా గులాబీ జెండాకే పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు.

శేరిలింగంపల్లి ఎమ్మెల్యేతో సహా పార్టీ మారిన వారంతా ప్రజల కోసం కాదని, కేవలం తమ స్వార్థ ప్రయోజనాలు, ఆర్థిక లాభాల కోసమే కాంగ్రెస్‌లో చేరారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా ప్రజలకు మేలు చేసి ఉంటే, ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి చూపించాలని ఆయన పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం టైంపాస్ మాటలు చెబుతూ, కేసీఆర్‌పైన, తనపైన కేసులు పెడతామని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. నాయకులు పార్టీని మోసం చేసి వెళ్లినా, బీఆర్ఎస్ కార్యకర్తలు మాత్రం గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటున్నారని కేటీఆర్ ప్రశంసించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కేసీఆర్‌కు మళ్లీ అస్వస్థత..

- పర్యవేక్షిస్తున్న ప్రత్యేక వైద్యులు
- షుగర్, సోడియం స్థాయుల్లో హెచ్చుతగ్గులు
- హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందంతో చికిత్స
- ఫాంహౌస్‌కు చేరుకున్న కేటీఆర్, హరీశ్ రావు ఇతర నేతలు
- అవసరమైతే హైదరాబాద్‌కు తరలించే యోచన

హైదరాబాద్ ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ):

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) శనివారం అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో హైదరాబాద్ నుంచి ప్రత్యేక వైద్యుల బృందం వెంటనే అక్కడికి చేరుకుంది.

విశ్వసనీయ సమాచారం ప్రకారం కేసీఆర్ రక్తంలో చక్కెర (షుగర్), సోడియం స్థాయుల్లో హెచ్చుతగ్గులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వైద్య బృందం ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

తండ్రి అనారోగ్య వార్త తెలియగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తన కుమారుడు హిమాన్షుతో కలిసి స్వయంగా కారు నడుపుకుంటూ ఫాంహౌస్‌కు చేరుకున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి కూడా ఎర్రవల్లికి వచ్చి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ప్రస్తుతం వైద్యుల బృందం ఫాంహౌస్‌లోనే ఉండి కేసీఆర్ ఆరోగ్యాన్ని నిరంతరం గమనిస్తోంది. మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి కూడా అక్కడే ఉండి వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఆయన ఆరోగ్యం మెరుగుపడకపోతే, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించే అవకాశం ఉందని తెలుస్తోంది.



# బైపోల్స్‌కి బీఆర్ఎస్ రెడీ..

## జూబ్లీహిల్స్‌తో పాటు 10 చోట్ల ఉపఎన్నికలు రానున్నాయా?

- సుప్రీం కోర్ట్ తీర్పును అనుకూలంగా భావిస్తున్న బీఆర్ఎస్
- ఇప్పటికే కొందరు ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు?
- త్వరలోనే మరికొందరికి అంటున్న గులాబీ వర్గాలు
- జూబ్లీహిల్స్‌తో పాటు ఆ పది చోట్ల బైపోల్స్ అంటున్న బీఆర్ఎస్
- పది నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాల కోసం అన్వేషణ
- అప్పుడే గెలిచాం, ఇప్పుడు నిలబెట్టుకుంటామన్న నమ్మకం

హైదరాబాద్ ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ):

బీఆర్ఎస్ బై పోల్ మూడ్‌లోకి వచ్చేసిందా? అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలుపెట్టిందా? ఎప్పుడు సైరన్ మోగినా మేము సై అంటూ సిద్ధమైపోతోందా? అసలిప్పుడు ఎందుకు హడావిడి చేస్తోంది కారు పార్టీ? ఏ ఉప ఎన్నికల కోసం సిద్ధమవుతోంది. జూబ్లీహిల్స్ తప్ప మిగతా చోట్ల ఇప్పటికిప్పుడు ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందా? గులాబీ లెక్కలేంటి? 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీ ఫామ్ మీద గెలిచి... తర్వాత కాంగ్రెస్‌లోకి జంప్ అయిపోయారు పది మంది ఎమ్మెల్యేలు. వాళ్ళ మీద అనర్హత వేటు వేయాలంటూ అసెంబ్లీ స్పీకర్‌ని కోరింది బీఆర్ఎస్. ఆ పోరాటంలో భాగంగా సుప్రీం కోర్ట్ దాకా వెళ్ళింది. తాజాగా వచ్చిన తీర్పు తమకు అనుకూలంగా ఉన్నట్టు భావిస్తున్నారు గులాబీ నేతలు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల సంగతిని మూడు నెలల్లోగా తేల్చమని స్పీకర్‌కు సూచించింది సుప్రీమ్ కోర్ట్. అందులో భాగంగా కొందరు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు బీఆర్ఎస్ లీడర్స్. మరి కొంత మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా త్వరలో నోటీసులు అందుకోబోతున్నారంటూ ప్రచారం చేస్తున్నారు. ఇదంతా చూస్తుంటే... వాళ్ళ మీద ఖచ్చితంగా అనర్హత పడుతుందని కారు పార్టీ గట్టిగా నమ్ముతున్నట్టుందని అంటున్నారు పరిశీలకులు. నిజంగానే అనర్హత వేటు పడితే.. ఆ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయం. అవి కూడా ఎంతో దూరంలో లేవని, జూబ్లీహిల్స్ బైపోల్‌తో పాటే జరుగుతాయని నమ్ముతోందట కారు పార్టీ అధిష్టానం. అందుకే ఆయా నియోజకవర్గాల మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టబోతున్నట్టు సమాచారం.

పార్టీ మారిపోయిన ఎమ్మెల్యేలకు ప్రత్యామ్నాయ నేతల్ని సిద్ధం చేసే కార్యక్రమం మొదలైపోయిందట. అందులో భాగంగానే... గెలుపు గుర్రాల కోసం అన్వేషణ మొదలైనట్టు తెలిసింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ గాలి వీచినా.... ఆయా నియోజకవర్గాల్లో తమ పార్టీ గెలిచింది కాబట్టి....ఇప్పుడు ఉప ఎన్నికలంటూ జరిగితే... తిరిగి దతమ ఖాతాలోనే పడిపోతాయన్నది బీఆర్ఎస్ పెద్దల నమ్మకం అట. ఈసారి టిక్కెట్స్‌ను అధిష్టానానికి దగ్గరగా ఉన్న వాళ్లకి, గెలిచాక కూడా పక్క చూపులు చూడని వాళ్ళకు ఇవ్వాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. పది



నియోజకవర్గాల్లో అలాంటి వాళ్ళు ఎవరున్నారని వెదుకుతున్నారట. శేరిలింగంపల్లిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పటాన్‌చెరులో ఆదర్శ్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్‌లో మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య, ఖైరతాబాద్ నుంచి మన్నే గోవర్ధన్ రెడ్డి, రాజేంద్రనగర్‌లో సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి, జగిత్యాలలోఎమ్మెల్సీ ఎల్ రమణ, బాన్సువాడ నుంచి ఆర్టీసీ మాజీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, గద్వాలలో హనుమంతు నాయుడు లేదా కాంగ్రెలో ఉన్న వారిని లాక్కునే అవకాశం ఉందని అంటున్నారు.

ఇక భద్రాచలంలో రేగా కాంతారావుకు, చేవెళ్ల నుంచి కొత్త వారికి టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఇక వీళ్లు మాత్రమే కాకుండా... ఉప ఎన్నికలంటూ జరిగితే ఆ టైంకి కాంగ్రెస్ నుంచి గానీ లేకుంటే వేరే పార్టీల నుంచి బలమైన నాయకులు ఎవరైనా ఆసక్తిగా ఉంటే వాళ్ళనుగాని చేర్చుకుని గెలిపించుకునేలా ప్లాన్ చేస్తోందట బీఆర్ఎస్ అధిష్టానం. వాళ్ళు ఊహిస్తున్నట్టుగా... ఒకవేళ ఈ 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరిగితే మాత్రం... ఆ ఫైట్ అసెంబ్లీ సాధారణ ఎన్నికల్ని మించి పోతుంది. అందుకే ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెడుతున్నారట. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించుకుంటూ... అక్కడ ఇన్చార్జ్‌లను నియమిస్తూ... క్యాడర్ ను ఉత్తేజపరచాలని చూస్తున్నారట. ఒకవేళ స్పీకర్ నిర్ణయం తీసుకొని వాళ్లపై అనర్హత వేటు వేస్తే... ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి. ముందుగానే అలర్ట్ అవుతోందట గులాబీ పార్టీ. ఈ ముందస్తు ఏర్పాట్లు సఫలం అవుతాయో లేదో చూడాలి మరి.

# వినాయక చవితి వేళ తియ్యని కబురు చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

- గణేశ్ మండపాలకు, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్
- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- అనుమతి ఉన్న మండపాలకే ఈ సౌకర్యం వర్తింపు
- ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలు
- వేగంగా జరుగుతున్న హైదరాబాద్ గణేశ్ మండపాల ఏర్పాటు
- తుది దశకు చేరిన ప్రఖ్యాత ఖైరతాబాద్ గణపతి విగ్రహం పనులు

హైదరాబాద్ ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ):

తెలంగాణలో పండుగ వాతావరణం నెలకొంటున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ నిర్వాహకులకు ఒక తీపికబురు అందించింది. వినాయక చవితి, దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే గణేశ్, దుర్గామాత మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని, అయితే నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొంది ఉండాలని స్పష్టం చేసింది. ఈ నెల 27వ తేదీ నుంచి గణేశ్ చతుర్థి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ నిర్ణయంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాజధాని హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో మండపాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముఖ్యంగా, తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహ నిర్మాణ పనులు తుది ఘట్టానికి చేరుకున్నాయి. ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ప్రకటించడంతో ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో మండపాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుంది.



# యూరియా ఇవ్వకుండా అభాండాలా?

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తున్నదని ఆరోపణలు చేయడం ద్వంద వైఖరికి నిదర్శనం అని మండిపడ్డారు. యూరియా దిగుమతులు లేక దేశీయంగా ఉత్పత్తి డిమాండ్‌కు తగ్గ స్థాయిలో లేక నెలకొన్న కొరతపై వాస్తవాలు దాయడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా యూరియా కొరత నెలకొంటే రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లేలా కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం కేంద్రమంత్రి స్థాయికి తగినట్లు లేదని హితవు పలికారు. తెలంగాణ ప్రజానీకం మీకు ఓట్లు వేసి గెలిపిస్తేనే కేంద్ర మంత్రి అయ్యారన్నారు. రైతుల యూరియా కష్టాలు తీరేలా కేంద్ర మంత్రిగా మీరు చొరవ తీసుకుని సరఫరా చేయించండి, అదనంగా సరఫరా చేయిస్తే కృతజ్ఞతలు తెలుపుతామని చెప్పారు. అలా చేయకుండా కేంద్రం అలసత్వంతో ఏర్పడిన యూరియా కొరతపై వాస్తవాలు దాచి రాజకీయ ఆరోపణలు చేయడం తగదని మండిపడ్డారు. మంత్రులు పదే పదే చెప్పడం వల్లే రైతులు యూరియా ముందే కొనుక్కునే ప్రయత్నం చేస్తున్నారన్న కిషన్ రెడ్డి వ్యాఖ్యలు బురద జల్లేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా సరఫరాలో జాప్యం ఇంపోర్ట్ లేకపోవడం దేశీయంగా ఉత్పత్తి లేకపోవడం వల్లేనన్న వాస్తవాలు మంత్రులు



రైతులకు వివరిస్తుంటే అభాండాలు వేయడం ఏమిటని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇది మూడో పంటకాలమని, గత ఏడాదిన్నర కాలంలో యూరియా కోసం రైతులు ఎప్పుడూ ఆందోళన చెందలేదన్నారు. కేంద్రం కేటాయించిన యూరియా సకాలంలో సరఫరా చేయకపోవడం వల్లే రైతులు ఆందోళన చెందుతున్నారని, వాస్తవాలు దాచి రాజకీయ ఆరోపణలు చేయడం తగదని కిషన్ రెడ్డిపై ఫైరయ్యారు. కేంద్ర మంత్రి హోదాలో బాధ్యతగా కేంద్రం ప్రకటించిన 50 వేల టన్నుల యూరియా తక్షణమే సరఫరా అయ్యేలా చూడాలని రైతుల పక్షాన తుమ్మల విజ్ఞప్తి చేశారు.

# ధరావతు కోటి చెల్లించాల్సిందే..!

మొదటిపేజీ తరువాయి

చేసే వీల్లేకుండా పోతుంది.

హెచ్ఎండీఏ భూముల వేలం అంటేనే నగరంలో ఇదొక హాట్ టాపిక్. గతంలో ఎకరం వంద కోట్లకు ఈ వేలంలో దక్కించుకుని రియల్ వ్యాపారాన్ని పరుగులు పెట్టించిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా వేలం పాటలో పాల్గొనాలంటే కోటి ఖర్చు చేస్తే గానీ వీలు కాదనీ నిబంధనలు ముందుకు తీసుకువచ్చింది. గతంలో ప్లాట్ల సైజుల వారీగా కాకుండా భూముల వేలంలో పాల్గొనేందుకు ధరావతును రూ. 1లక్ష నుంచి రూ. 5లక్షల వరకు నిర్ణయించారు. ఒక్క కోకాపేట్ మినహా ఏ వెంచర్‌లోనైనా ఇదే తీరుగా అమలు చేశారు. కానీ ఇప్పుడు వెంచర్‌తో సంబంధం లేకుండా హెచ్ఎండీఏ విక్రయిస్తున్న ప్లాట్లను సొంతం చేసుకోవాలంటే కోటి రూపాయలు ముందుగానే చెల్లింపులు జరిపితే గానీ సాధ్యం కానీ పరిస్థితి వచ్చింది.

**వంద శాతం పెంపుతో..**

బయానా మొత్తాన్ని వంద శాతం పెంచడంతో రూ. లక్ష నుంచి ఒక్కసారి కోటి రూపాయలకు చేరింది. దీంతో గతంలో లక్ష రూపాయలు చెల్లించి ఆన్‌లైన వేలంలో పాల్గొనే వారి సంఖ్య ఇప్పుడు పరిమితం కానుంది. అయితే వేలంపాటలో కొనుగోలు చేసేవారి కోసం వాయిదా విధానంలో చెల్లించుకునే వెసులుబాటు కూడా ఉండేది. దీంతో లక్ష రూపాయలతో వేలంలో పాల్గొని, ఒకవేళ ప్లాటు దక్కితే వాయిదా పద్ధతిలో చెల్లించుకునే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు రూ. కోటిని ముందుగానే చెల్లించాలని చెప్పడం వలన వేలం ప్రక్రియ మరింత జటిలం కానుంది. దీంతో పరిమిత కొనుగోలుదారుల




తో వేలం పాట జరిగే అవకాశం ఉందని అధికారులు కూడా చర్చించుకుంటున్నారు.

**వేలానికి ముందే వడపోత...**

హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు మాత్రం గతంలో వేలం పాటలో కొనుగోలు చేసి, ఆ తర్వాత వాయిదా పద్ధతిలో ప్లాట్లకు డబ్బులు చెల్లించలేని వారే ఎక్కువ ఉన్నట్లుగా చెబుతున్నారు. అందుకే ధరావతు మొత్తాన్ని రూ. కోటికి పెంచడం వలన అనవసరంగా పాల్గొనే వారి సంఖ్య తగ్గుతుందని భావిస్తున్నారు. కానీ మంది ఎక్కువగా ప్లాట్ల కోసం పోటీ పడినప్పుడే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా పెరుగుతుంది. ఇప్పుడు కోటి రూపాయలు ముందుగా చెల్లించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనేలా ముందస్తు వడపోత కారణంగా... వేలానికి ఆదరణ ఆశించిన స్థాయిలో రాదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా హెచ్ఎండీఏ తీసుకున్న నిర్ణయం కేవలం బడా నిర్మాణ సంస్థలకు మాత్రమే లబ్ధి చేకూర్చుతోందనే వాదనలు ఉన్నాయి. దీంతో ఎగువ మధ్యతరగతి, సాధారణ ఎన్ఆర్ఐ వర్గాల నుంచి పెట్టుబడులు తగ్గే అవకాశం ఉంటుంది.

# రాహుల్ గాంధీ 'ఓట్ల చోరీ' ఆరోపణలకు రాజ్ థాకరే మద్దతు!

- ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కయ్యాయని రాహుల్ విమర్శ
- ఈ అంశాన్ని తాను 2016-17లోనే లేవనెత్తానని చెప్పిన థాకరే
- ఎన్నికలను బహిష్కరించాలన్న తన సూచనను ప్రతిపక్షాలు పట్టించుకోలేదని వ్యాఖ్య
- ఓటర్ల జాబితాలపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు

నేషనల్‌బ్యూరో ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ):

దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియలో 'ఓట్ల చోరీ' జరుగుతోందంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన తీవ్ర ఆరోపణలకు మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ థాకరే అనూహ్యంగా మద్దతు పలికారు. ఈ అంశంపై తాను ఎప్పటినుంచో పోరాడుతున్నానని, ప్రతిపక్షాలు తన మాట వినలేదని ఆయన అన్నారు.

పూణేలో శనివారం జరిగిన పార్టీ ఆఫీస్ బేరర్ల సమావేశంలో రాజ్ థాకరే మాట్లాడుతూ "ఓట్ల తారుమారు అంశం కొత్తదేమీ కాదు. నేను 2016 17లోనే ఈ విషయాన్ని లేవనెత్తాను. అప్పట్లో శరద్ పవార్, సోనియా గాంధీ, మమతా బెనర్జీ వంటి నేతలను కలిసి మాట్లాడాను. లోక్‌సభ ఎన్నికలను బహిష్కరిస్తే ప్రపంచం దృష్టిని ఆకర్షించవచ్చని, అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతుందని సూచించాను. కానీ అందరూ భయపడి వెనక్కి తగ్గారు" అని విమర్శించారు. ఇప్పుడు రాహుల్ గాంధీ మళ్లీ అదే అంశాన్ని ప్రస్తావించారని థాకరే గుర్తుచేశారు.



"ప్రజలు ఓట్లు వేస్తున్నారు, కానీ ఆ ఓట్లు అభ్యర్థులకు చేరడం లేదు. వాటిని దొంగిలిస్తున్నారు. 2014 నుంచి ఈ ఎన్నికల గందరగోళాన్ని ఉపయోగించుకునే ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఉదాహరణగా చూపుతూ.. బీజేపీ 132, ఏక్‌నాథ్ షిండే వర్గం 56, అజిత్ పవార్ వర్గం 42 సీట్లు గెలిచినా, ఆ ఫలితాలను గెలిచినవారు గానీ, ఓడినవారు గానీ జీర్ణించుకోలేకపోయారని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన తన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఈ నెల ప్రారంభంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం బీజేపీతో కుమ్మక్కై ఎన్నికలను దొంగిలిస్తోందని ఆరోపించారు. కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 6.5 లక్షల ఓట్లకు గాను లక్షకు పైగా ఓట్ల చోరీ జరిగిందని, ఓటర్ల జాబితాలో నకిలీ పేర్లను చేర్చుతున్నారని విమర్శించారు. అయితే, ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని, లేదంటే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. దీనిపై రాహుల్ గాంధీ స్పందించలేదు.

03
POLITICAL & GENERAL
JOURNALIST DAIRY
సోమవారం
25-08-2025
జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక



## హెచ్ఎంఎస్ మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ

**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలనీ(ఆగస్టు 24):** ఎస్ఎం ఈడబ్లూయు (హెచ్ఎంఎస్) సింగరేణి రామగుండం మూడవ ఏరియా ప్రతినిధులు ఆదివారం యూనియన్ 26వ ద్వైపాక్షిక రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఏరియా సెంటినరీ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, ఏరియా కమిటి, గనులు, డిపార్ట్ మెంట్ల పిట్ కమిటీల ప్రతినిధులు పాల్గొని, రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ కేంద్ర కమిటీ సభ్యులు గోశిక అశోక్, బ్రాంచ్, పిట్ కమిటీల నాయకులు మాట్లాడుతూ కార్మికుల ఆత్మ గౌరవం, హక్కుల సాధన, సంస్థ పరిరక్షణ కొరకు ఎల్లవేళలా పోరాడే కార్మిక సంఘం హెచ్ఎంఎస్ మాత్రమేనన్నారు. ప్రతీ కార్మికున్ని చైతన్యవంతం చేస్తూ, వారికి అండగా నిలుస్తున్న హెచ్ఎంఎస్ యూనియన్ 26వ ద్వైపాక్షిక రాష్ట్ర మహాసభలు ఆగస్టు 30, 31 తేదీల్లో గోదావరి ఫంక్షన్ హాల్ శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలకు యూనియన్ ప్రతినిధులు, కార్యకర్తలు, కార్మికులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట. మహేష్, రెవెల్లి. రాజశేఖర్, రంగు. అంజి, హుస్సేన్, రాణా, చరణ్, గోసిక శ్రీకాంత్, అజయ్, కుమారస్వామి పాల్గొన్నారు.



## సురవరం సుధాకర్ రెడ్డికి సీపీఐ నేతల నివాళి.

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో(ఆగస్టు 24):** సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. శ్రీను ఆధ్వర్యంలో షాద్ నగర్ నియోజకవర్గ ముఖ్య కూడలిలో సురవరం చిత్ర పటానికి పూలమాలలు వేసి నేతలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి తన జీవితం కమ్యూనిస్ట్ పార్టీ ఉద్యమానికి అంకితం చేశారన్నారు. తాను కార్మికుల, కర్షకుల, పేదల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూ వారి హక్కులను సాధించడానికి అనేక ఉద్యమ మార్గాలను చూపించినటువంటి మహోన్నతమైన వ్యక్తి అన్నారు. కొన్ని దశాబ్దాలు సీపీఐ పార్టీ తెలంగాణ రాష్ట్రంతో పాటు భారతదేశ వ్యాప్తంగా కమ్యూనిస్ట్ పార్టీ బలోపేతానికి ఆహర్నిషలు కృషి చేసిన గొప్ప వ్యక్తి సురవరం అని తెలిపారు. ఇది కమ్యూనిస్ట్ పార్టీకి తీరని లోటని తెలిపారు. వారి ఆశయ సాధనలో తామంతా కంకణ బద్దులమై ఉద్యమ పోరాటలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థి దశ నుంచి పార్టీ త్యాగ యాత్రలో, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతర పోరాటం సాగించారు. ఎర్ర జెండా పట్ల మీ నిబద్ధత, ధైర్యం, క్రమశిక్షణ తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి అన్నారు. మీకున్న ఆలోచనలూ, మార్గదర్శకత్వం ఎప్పటికీ మాతోనే ఉంటాయి అని చెప్పారు ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య, నర్సింహా రెడ్డి, మండల కార్యదర్శులు గడ్డం గంజయ్య, గోవింద్ నాయక్, లింగం నాయక్, రమేష్, రవి, నర్సింహ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్ నాయక్, సాయి తదితరులు పాల్గొన్నారు

## సంబరాజు రవి శర్మను సన్మానించిన మిత్ర బృందం

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో(ఆగస్టు 24 ):**

బ్రాహ్మణ సమాజ అభివృద్ధికి శక్తి వచనం లేకుండా కృషి చేయాలని రాష్ట్ర బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య యువజన ఆర్గనైజింగ్ సెక్రటరీ సంబరాజు రవి శర్మకు మిత్ర బృందం సూచించింది. ఇటీవల రాష్ట్ర బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య యువజన ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సంబరాజు రవి శర్మను ఆదివారం అతని మిత్ర బృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చిన్ననాటి స్నేహితులు జర్నలిస్ట్ రఘు నందన్, చంద్రా రెడ్డి, సాయిరెడ్డి, మల్లేష్, వీరేందర్ రెడ్డి, వినోద్ కుమార్, అచ్యుత్ రెడ్డి తదితరులు కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞాపికను అందజేశారు. రాష్ట్రస్థాయిలో ఎదిగినందుకు తమ మిత్రుడు అభివృద్ధి పట్ల తమకు ఎంతో గర్వకారణమని జర్నలిస్టు రఘునందన్ పేర్కొన్నారు. మరిన్ని పదవులు పొందాలని సూచించారు.





## ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో పోటీపడాలి

**రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ) : వ్యాపార రంగంలో పోటీతత్వం తప్పనిసరిగా ఉంటుందని ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించడంలో పోటీ పడాలని తెలంగాణ బగారబువ్వ కోడికూర రెస్టారెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని మహబూబ్ నగర్ రోడ్డులో ఎస్బీఐ బ్యాంక్ పక్కన సుజిత్ రెడ్డి సుకుమార్ రెడ్డి, వినీత్ రెడ్డి, వరుణ్ రెడ్డి కలిసి నూతనంగా ఏర్పాటుచేసిన తెలంగాణ బగార బువ్వ కోడికూర రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ రెస్టారెంట్ యాజమాన్యం ఎంచుకున్న తెలంగాణ భగార బువ్వ కోడికూర అనే పేరు భోజన ప్రియులను ఆకర్షించే విధంగా ఉందని దానికి అనుగుణంగా భోజన ప్రియులకు నాణ్యమైన రుచికరమైన ఆహారము అందించి ఈ రంగంలో విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ నంద కిషోర్,ఈశ్వర్ రాజు,షాద్ నగర్ బీఆర్ఎస్ టౌన్ యువత అధ్యక్షులు లంకల రాఘవేందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి,నాయకులు నక్కల వెంకటేష్, రాజారెడ్డి,దినేష్ సాగర్, యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

# అనుమానంతో భార్యను చంపి ముక్కలుగా నరికి..

- మూసీలో పడేసిన కిరాతకుడు
- 5 నెలల గర్భిణీ అని తెలిసి కూడా దారుణం
- ఏమీ ఎరుగనట్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- తమదైన స్టైల్‌లో విచారించగా నేరం అంగీకారం

**హైదరాబాద్ ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ):**

ప్రేమించానన్నాడు. నువ్వు లేనిదే బతకలేనని నమ్మించాడు. పెళ్లి చేసుకున్నాడు. ఆ తరువాత అనుమానమనే భూతం పట్టడంతో రాక్షసుడిలా మారాడు. 5 నెలల గర్భిణీ అనే జాలి కూడా లేకుండా నమ్మి తాళి కట్టించుకున్న భార్య గొంతు కోసి హత్య చేశాడు. మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా చేసి శరీర భాగాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి మూసీలోకి విసిరేశాడు. ఆ తరువాత ఏమీ ఎరుగనట్టు బంధువుతో కలిసి స్టేషన్‌కు వెళ్లి తన భార్య కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశాడు. చివరకు పోలీసులకు దొరికిపోయాడు. సంచలనం సృష్టించిన ఈ కిరాతక ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఏసీపీ చక్రపాణితో కలిసి ఆదివారం మీడియా సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు.

**ఇద్దరిదీ ఒకే ఊరు**

వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడకు చెందిన సామల మహేందర్ రెడ్డి (27) అదే గ్రామానికి చెందిన స్వాతి అలియాస్ జ్యోతి(21)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇరుగుపొరుగునే ఇండ్లు ఉండడంతో ఇద్దరి మధ్య ముందు పరిచయం ఏర్పడింది. స్వాతిని ఇష్టపడ్డ మహేందర్ రెడ్డి అదే విషయాన్ని ఆమెతో చెప్పాడు. ప్రేమిస్తున్నాను పెళ్లి చేసుకుందామన్నాడు. మొదట్లో ఇరువైపులా పెద్దలు వీరి వివాహానికి అంగీకరించలేదు. ఒకరిని విడిచి మరొకరం ఉండలేమని మహేందర్ రెడ్డి, స్వాతి మొండి పట్టు పట్టడంతో చివరకు ఒప్పుకొన్న పెద్దలు గతేడాది జనవరి 20న కూకట్‌పల్లి ఆర్య సమాజ్‌లో వివాహం జరిపించారు. ఆ తరువాత ఇద్దరు బోడుప్పల్ ఈస్ట్ బాలాజీహిల్స్ ప్రాంతంలోని శ్రీనివాస్ నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టారు. స్వాతి పంజాగుట్టలోని ఎబెక్స్ కాల్ సెంటర్‌లో ఉద్యోగంలో చేరగా మహేందర్ రెడ్డి ర్యాపిడో డ్రైవర్‌గా పని చేయడం ప్రారంభించాడు.

**పెళ్లయిన నెల రోజుల నుంచే..**

వివాహమైన తరువాత మొదటి నెల వీరి కాపురం ఆనందంగానే సాగింది. స్వాతి కాల్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తుండడం, తరచూ ఫోన్లు మాట్లాడుతుండడంతో మహేందర్ రెడ్డిలో అనుమానం మొదలైంది. ఈ క్రమంలో ఆమెను అనుమానించడం మొదలు పెట్టి చిన్న చిన్న విషయాలపై గొడవలు పెట్టుకోవడం ప్రారంభించాడు. స్వాతితో ఉద్యోగం కూడా మానిపించేశాడు. ఆ తరువాత భార్యను తీసుకుని ఊరికి వెళ్లిపోయాడు. అక్కడ కూడా స్వాతితో గొడవలు పడడాన్ని కొనసాగించాడు. నానాటికీ మహేందర్ రెడ్డి వేధింపులు ఎక్కువ అయిపోవడంతో భరించలేక పోయిన స్వాతి పెళ్లయిన 3 నెలలకే వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసులు కూడా నమోదయ్యాయి. అయితే, గ్రామ పెద్దలు పంచాయితీ జరిపి ఇద్దరికీ నచ్చజెప్పారు. దాంతో వివాదం సద్దుమణిగింది. ఆ తరువాత రెండు నెలలకు మళ్లీ శ్రీనివాస్ నగర్‌కు వచ్చి అంతకుముందు ఉన్న ఇంటిలోనే అద్దెకు దిగారు. ఇటువంటి పరిస్థితుల్లోనే స్వాతి మార్చి





నెలలో గర్భం దాల్చింది. ప్రస్తుతం ఆమె 5 నెలల గర్భిణీ. అయితే, దీనికి కారణం తాను కాదని అనుమానించాడు. శుక్రవారం స్వాతి తాను ఈ నెల 27న ఊరికి వెళతానని మహేందర్ రెడ్డితో చెప్పింది. వైద్య పరీక్షలు చేయించుకున్న తరువాత పుట్టింటికి పోతానని తెలిపింది. దీనికి మహేందర్ రెడ్డి అంగీకరించలేదు. దాంతో ఇద్దరి మధ్య పెద్ద గొడవ జరిగింది. అప్పుడే స్వాతిని చంపేయాలని నిర్ణయించుకున్నాడు.

**భార్యను చంపాలని.. రంపం కొని..**

భార్యను చంపాలని పథకం ప్రకారం మహేందర్ రెడ్డి బోడుప్పల్‌లోని ఓ షాపు నుంచి గ్రిప్ యాక్సా బ్లేడ్ (రంపం) కొని తెచ్చి ఇంటిలో పెట్టాడు. శనివారం ఇంటి యజమాని కుటుంబం బయటకు వెళ్లడంతో అదే అదునుగా భావించి భార్యను గొంతు కోసి కిరాతకంగా హత్య చేశాడు. ఆ తరువాత తల, చేతులు, కాళ్లను ముక్కలు ముక్కలుగా నరికేశాడు. వాటిని ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి ప్రతాప సింగారం వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న మూసీ నదిలోకి విసిరేశాడు. ఛాతీ భాగాన్ని ఏం చేయాలో అర్థంగాక ఇంటిలోనే పెట్టుకున్నాడు. ఆ తరువాత బంధువుతో కలిసి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన భార్య కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశాడు. అయితే, శ్రీనివాస్ నగర్ మేడిపల్లి స్టేషన్ పరిధిలో ఉండడంతో అక్కడ కంప్లయింట్ ఇవ్వాలని ఉప్పల్ పోలీసులు చెప్పారు. ఈ క్రమంలో మహేందర్ రెడ్డి బంధువుతో కలిసి మేడిపల్లి స్టేషన్‌కు వెళ్లాడు. అతని వాలకంపై అనుమానం వచ్చిన సీఐ గోవింద రెడ్డి, ఎస్ఐ నర్సింగ్ రావులు నిశితంగా ప్రశ్నించగా మహేందర్ రెడ్డి చేసిన నేరాన్ని అంగీకరించాడు. ఈ క్రమంలో పోలీసులు అతని ఇంటి నుంచి స్వాతి మృతదేహంలోని ఛాతీ భాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. మూసీలోకి విసిరేసిన మిగితా శరీర అవయవాల కోసం గాలింపు జరిపినా దొరకలేదు. గాలింపును కొనసాగిస్తామని డీసీపీ పద్మజ చెప్పారు. కేసులో మరిన్ని ఆధారాలు సేకరించాల్సి ఉన్నందున విచారణను కొనసాగించనున్నట్టు తెలిపారు.

## అయ్యా.. బడిని పట్టించుకోండి!

- రామచంద్రాపూర్ పాఠశాల దుస్థితిపై లేఖ
- షాద్ నగర్ ఎమ్మెల్యేకి విన్నవించిన మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో(ఆగస్టు 24 ):** షాద్ నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్‌కు పాఠశాలల దుస్థితిపై కొందుర్గు మండల బీజేపీ అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి లేఖ రాశారు. కొందుర్గు మండల బీజేపీ ఆధ్వర్యంలో "పల్లెకు పోదాం పాఠశాలను చూద్దాం" కార్యక్రమంలో భాగంగా రామచంద్రాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన విషయాన్ని లేఖలో చెబుతూ, బడిలో ఒక గది అధ్వాన్నమైన పరిస్థితుల్లో ఉందని, విద్యార్థులకు నిరుపయోగంగా ఉందన్నారు. ఒక గదిని గ్రామపంచాయతీ కార్యాలయంగా ఉపయోగిస్తున్నారని, మరొక గది వర్షాలకు కురుస్తోందని తెలిపారు. తరగతులు నిర్వహించుటకు చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వీలైనంత తొందరగా పాఠశాలను సందర్శించి పాఠశాల అభివృద్ధికి తగు చర్యలు తీసుకొనగలరని విజ్ఞప్తి చేశారు.



## ఈ రోజుల్లో పల్లెటూరు వంటకాలే ప్రత్యేకం

**మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో(ఆగస్టు 24 ):**

ఆరోగ్య దృష్ట్యా ఈరోజుల్లో పల్లెటూరి వంటకాలకే ప్రాధాన్యత ఉందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం షాద్ నగర్ పట్టణంలోని జడ్చర్ల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన నాటుకోడి, పులావ్ రెస్టారెంట్ ను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. తెలంగాణ రుచుల్లో నాటుకోడి, పులావ్ అన్నం కు ఎంతో ప్రాధాన్యత, ప్రత్యేకత ఉందని, ఆ వంటకాల్లో వినియోగించే సుగంధ దినుసులతో ఆరోగ్యానికి మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. బాయిలర్ కోడి కంటే నాటుకోడి వంటకంతో శరీరానికి మంచి పోషకాలు అందుతాయని పేర్కొన్నారు. పల్లెటూరి సాంప్రదాయ వంటకాలతో వినియోదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించి, వ్యాపార పరంగా అభివృద్ధి చెందాలని హోటల్ నిర్వాహకులకు సూచించారు. ముఖ్యంగా హోటల్ ఆవరణలో శుభ్రతను కచ్చితంగా పాటించాలని, నాణ్యమైన వస్తువులను వినియోగించి వినియోదారుల మన్నలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, నాయకులు లక్ష్మణ్ నాయక్, నక్కల వెంకటేష్‌గౌడ్, దేవేందర్ యాదవ్, వెంకట్ రెడ్డి, నంద కిషోర్, ఈశ్వర్ రాజు, జూపల్లి శంకర్, లంకాల రాఘవేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాయి ప్రసాద్, రమేష్, భువనేశ్వర్ రెడ్డి, రాఘవేందర్, నార్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






## మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సహకారంతో అయ్యవారిపల్లి రోడ్డుకు మరమ్మతులు

**కృతజ్ఞతలు తెలిపిన బీఆర్ఎస్ నేత భీమారం వీరేశం**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో(ఆగస్టు 24 ):** ఇటీవల కాలంలో భారీ వర్షాలకు కోతకు గురైన అయ్యవారిపల్లి వాగు రోడ్డును మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ సహకారంతో బీఆర్ఎస్ నాయకుడు భీమారం వీరేశం మరమత్తులు చేయించారు. టిప్పర్ల ద్వారా మట్టిని తరలించి రోడ్డును చదును చేశారు. వాహనాల రాకపోకలకు అనువుగా రోడ్డును బాగు చేసి గ్రామాల ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. కోతకు గురైన రోడ్డును స్వచ్ఛందంగా, సొంత నిధులతో బీఆర్ఎస్ నేతలు రోడ్డును బాగు చేయడం పట్ల అయ్యవారిపల్లి, చించోడు, భీమారం, దేపల్లి, ఉప్పరిగడ్డ తదితర గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## భారత రైతాంగ మహాసభలకు తరలిరండి

**జిల్లా రైతులకు కోరే గావ్ సేన పిలుపు**

**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలనీ(ఆగస్టు 24):** అఖిల భారత ఐక్య రైతు సంఘం మహాసభలకు అధిక సంఖ్యలో తరలిరావాలని రైతులకు భీమా కోరే గావ్ సేన అధ్యక్షులు ఇరికి మహేష్ పిలుపునిచ్చారు. ఆదివారం కాలనీలో జరిగిన కోరే గావ్ సేన సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేసినట్టు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం రూపంతో మళ్ళీ తీసుకువచ్చిందన్నారు. ఇందుకు వ్యతిరేకంగా పలు రాష్ట్రాల్లో వివిధ పేర్లతో విడివిడిగా పని చేస్తున్న రైతు సంఘాలు 2024 డిసెంబర్ మాసం కలకత్తాలో సమావేశమై, అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఎఐయుకేఎస్) గా ఏర్పడిందన్నారు. ఈ సంఘం సాగు సమస్యల పరిష్కారానికి, రైతు రక్షణకు, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, రైతాంగం సమైక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎఐయుకేఎస్ స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని, ఎంఎస్పీ కి చట్టబద్ధత కల్పించాలని, సంయుక్త కిసాన్ మోర్చ ఎస్కేఎం తో కలిసి పని చేసిందని, ఈ నేపథ్యంలో భవిష్యత్ కార్యక్రమాలు కర్తవ్యాలు రూపొందించుకోవడానికి 2025 ఆగస్టు 25,26 తేదిలో మహబూబ్ నగర్ లో ప్రథమ మహాసభలు జరుగుతున్నందున, మహాసభలకు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలి రావలనీ, సేన అధ్యక్షులు మహేష్ పెద్దపల్లి జిల్లా రైతాంగాన్ని కోరారు. ఈ సమావేశంలో సేన నాయకులు మడిపల్లి. సాగర్, బాదె. వెంకటేష్, బదె. తేజ, చాట్ల. బన్నీ, ఈశ్వర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

**సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్**

**జర్నలిస్ట్ డైరీ, వీణవంక (ఆగస్ట్ 24):** పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. ఆదివారం తెలంగాణ గ్రామ పంచాయతి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల 5వ మహసభ మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వీడి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పంచాయతీ కార్మికుల ఉద్యోగ భద్రత,కనీస వేతనం అమలు తో పాటు పీఎఫ్ ఈఎస్ఐ సదుపాయం,ప్రమాద బీమా సదుపాయం 15 లక్షలు ఇన్సూరెన్స్ చేయించాలని అన్నారు.గ్రీన్ ఛానల్ ద్వారా ప్రభుత్వమే నేరుగా పంచాయతీ కార్మికుల ఖాతాలలో వేతనాలు చెల్లించాలని, పై డిమాండ్ల సాధన కోసం భవిష్యత్తు పోరాట ల కోసం, మండల స్థాయిలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేస్తూ, అవసరమైతే రానున్న రోజులలో మరో సమ్మె పోరాటానికి సన్నద్ధం కావాలన్నారు.. ఈ కార్యక్రమంలో మహంకాళి కొమురయ్య, కండే సదయ్య దాసరపు వెంకటేష్, కదం కిషన్ రావు, శంకర్ అంబాల సదానందం, రాజయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# భారతదేశంలో అకడమిక్ స్వేచ్ఛ క్షీణత: పరిశోధనలపై ప్రభుత్వ జోక్యం

భారతదేశంలో అకడమిక్ స్వేచ్ఛలు క్రమంగా క్షీణిస్తున్నాయి. పరిశోధన సంస్థలపై దాడులు, ఆరోపణలు, ఫండింగ్ ఆంక్షలు వంటివి ఈ ధోరణిని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇటీవల సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) మరియు దాని "లోక్‌నితి ప్రోగ్రామ్" పై "ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్" (ఐసీఎస్ఎస్ఆర్) జారీ చేసిన షో కాజ్ నోటీసు ఈ సమస్యకు తాజా ఉదాహరణ. లోక్‌నితి కోడైరెక్టర్ సంజయ్ కుమార్ ఎక్స్ (పూర్వం ట్విట్టర్)లో పోస్ట్ చేసిన మహారాష్ట్ర ఎన్నికల రోల్‌లో తప్పుడు డేటా పోస్ట్‌ను కారణంగా చూపి, ప్రభుత్వం ఈ సంస్థలపై దాడి చేస్తోంది. సంజయ్ కుమార్ తన పోస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నానని చెప్పి డిలీట్ చేసి క్షమాపణలు చెప్పినప్పటికీ, మహారాష్ట్ర పోలీసు అతనిపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

**ఐర్లాండ్‌లో వలసల వ్యతిరేకత ఉద్యమాలు : భారతీయులపై ప్రభావం**

ఐర్లాండ్, ఒకప్పుడు శాంతియుతమైన, స్వాగతించే దేశంగా పేరొందిన గ్రీన్ ఐల్, ఇప్పుడు వలసల వ్యతిరేకత రాజకీయాకరణ ద్వారా ఉద్భవిస్తున్న జాత్యహంకార దాడులతో కలుషితమవుతోంది. డబ్లిన్ ఉపనగరమైన టాలఘ్ట్‌లో జూలై 19న ఒక భారతీయుడిపై దాడి జరిగింది. ఇది క్రమంగా ఇటీవలి కాలంలో భారతీయ వలసదారులపై వరుసగా జరుగుతున్న దాడులకు సాక్షంగా నిలుస్తోంది. ఈ ఘటనలు కేవలం వ్యక్తిగత ద్వేషాలు మాత్రమే కాదు. అవి సామాజిక, ఆర్థిక అసమానతలు, రాజకీయ నాయకుల ఉద్దేశపూర్వకమైన ఉద్వేగాలు,స్థానిక యువతలో పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తున్నాయి. భారతీయులు, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, ఐర్లాండ్‌ను ఆకర్షణీయమైన గమ్యస్థానంగా భావిస్తున్నారు. కానీ, ఈ దాడులు వారి భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఐర్లాండ్‌లో భారతీయుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, 5,000 మందికి పైగా భారతీయ విద్యార్థులు అంతర్జాతీయ విద్యార్థులలో 13.2 శాతాన్ని ఆక్రమిస్తున్నారు. ఇది ఐర్లాండ్ దేశ ఆర్థిక వృద్ధికి సహకరిస్తుంది. కానీ, స్థానిక ప్రజలలో పెరుగుతున్న గృహ సంక్షోభం, జీవన వ్యయం పెరుగుదల వల్ల స్థానిక ప్రజలలో వలసదారులపై కోపం, ద్వేషం పెరుగుతోంది. ఐరిష్ పౌరులు మెరుగైన అవకాశాల కోసం విదేశాలకు వెళ్తుండగా, భారతీయులు అలాగే ఇతర జాతీయులు ఆ లోపాలను పూరిస్తున్నారు. అయితే, రాజకీయ నాయకులు ఈ అసంతృప్తని ఉపయోగించుకుని వలసల వ్యతిరేక భావాలను రెచ్చగొడుతున్నారు. ఫార్‌రైట్ సమూహాలు, ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని, సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయి. టీనేజర్లు, వారి మెదడు అభివృద్ధి ఇంకా పూర్తికాని వయస్సులో, ఆన్‌లైన్ ద్వేషానికి బలవుతున్నారు. ఇది సమాజంలోని విద్యా, ఆర్థిక లోపాలను బయటపెడుతుంది.

నవంబర్ 2023లో డబ్లిన్‌లో జరిగిన అల్లర్లు ఈ సమస్య యొక్క తీవ్రతను హెచ్చరిస్తాయి. పాఠశాల వెలుపల పిల్లలపై దాడి తర్వాత, అత్యంత కుడి వర్గాలు(రైటిస్ట్ వింగ్స్ )ఆన్‌లైన్ పుకార్లను వ్యాప్తి చేసి, ఆందోళనలను రెచ్చగొట్టాయి. ఫలితంగా దుకాణాలు, వాహనాలు ధ్వంసమయ్యాయి. రక్షణగా వచ్చిన పోలీసులపై కూడా దాడులు జరిగాయి. ఈ అల్లర్లలో చాలామంది యువకులు, ముఖ్యంగా 20 ఏళ్లలోపు వారు, పాల్గొన్నారు. ఇది కేవలం జాత్యహంకారం మాత్రమే కాదు. ఇది ఆర్థిక అసమానతలు, విద్యా డ్రాపౌట్ రేట్లు, ఉపాధి కల్పనలో ప్రభుత్వ వైఫల్యాల వల్ల ఉద్భవిస్తున్న అలజడి. "ఫార్‌రైట్ నేషనల్ పార్టీ" యువకులను ఆకర్షిస్తుంది, వారిని అన్యాయానికి గురిచేస్తుంది. ప్రభుత్వం ఈ విషయంలో నిశ్శబ్దంగా ఉండటం దాని నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది. డరాఫ్ అడెలైడ్ వంటి నాయకులు చెప్పినట్లు, ఆస్టెరిటీ చర్యలు సమాజంలోని దుర్బర వర్గాలను మరింత దుర్బలంగా చేస్తున్నాయి, ఫాసిస్ట్ శక్తులకు దౌర్జన్యం చేసే అవకాశాలు ఇస్తున్నాయి. ఈ దాడులు భారతీయులకు మాత్రమే పరిమితం కాదు. అవి నల్లజాతి, ఆఫ్రికన్ సమూహాల పై కూడా జరుగుతున్నాయి. "ఐరిష్ నెట్‌వర్క్ అగైన్స్ట్ రేసిజం" అధ్యయనం ప్రకారం, ఆఫ్రికన్ వారసులు పోలీసు వ్యవస్థలో వివక్షను ఎదుర్కొంటున్నారు. నేరాల రిపోర్టింగ్‌లో నమ్మకం కోల్పోతున్నారు. ఫెల్జిన్ జోస్ వంటి కౌన్సిలర్లు నేరాలను రిపోర్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ, వ్యవస్థాగత లోపాలు ... పోలీసుల అసమర్థత, దర్యాప్తు ఆలస్యం కావడం బాధితులను నిరుత్సాహపరుస్తున్నాయి. యువత డైవర్షన్ ప్రోగ్రామ్‌లు ఉన్నప్పటికీ, పునరావృత్తి నేరస్థులపై కఠిన చర్యలు లేకపోవడం విమర్శకు తావిస్తుంది. యూరోపియన్ యూనియన్ నిబంధనలకు అనుగుణంగా జాత్యహంకారాన్ని ఎదుర్కోవడంలో ఐర్లాండ్ విఫలమవుతోందని మానవ హక్కుల కమిషన్ సూచనలు స్పష్టం చేస్తున్నాయి. ఆగస్టు 11న భారతీయ సమూహాల ప్రతినిధులు డిప్యూటీ ప్రధాని సైమన్ హారిస్‌తో సమావేశమై, గార్డాయ్, స్థానిక నాయకులతో లోతైన సంభాషణలు, చర్యలు డిమాండ్ చేశారు. ఇది సానుకూల దశ. కానీ, ఇది కేవలం ఉపశమనం మాత్రమే. ప్రభుత్వం తన లోపాలను అంగీకరించాలి. కానీ అందుకు వలసదారులను బాధ్యులను చేయడం అన్యాయం. రూత్ కాపింగర్ వంటి వ్యక్తులు ఉక్రెయిన్ శరణార్థులకు స్వాగతం చెప్పడం, స్థానిక ప్రజలను, నిరాశ్రయులను చేయడం వంటి వైరుధ్యాలను ఎత్తిచూపుతున్నారు. జెన్నిఫర్ వంటి సాధారణ ఐరిష్ మహిళలు బాధితులకు సహాయం చేస్తున్నారు. ఇది సమాజంలోని పాజిటివ్ దృష్టిని చూపుతుంది. కానీ ఇది వ్యవస్థాగత మార్పులకు ప్రత్యామ్నాయం కాదు. ఈ సమస్యలు ఐర్లాండ్‌కు మాత్రమే పరిమితం కావు. ఇవి ప్రపంచవ్యాప్తంగా వలసల సంక్షోభాలను ప్రతిబింబిస్తున్నాయి.అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ భారతీయ వలస దాలను వేధించటం, సంకెళ్లు వేసి అమెరికా సైనిక కార్గో విమానాలలో ఇండియాకు అవమానకరంగా తిప్పి పంపడం, కెనడాలో నూ, ఇండియా లో రొహింగియా పేరుతో ముస్లింల పై ద్వేషం,హింస చెలరేగటం. ముస్లింల ఇండ్లు పై, షాపులపై దాడులు, కెనడా లొ భారతీయ విద్యార్థుల పై దాడులు, తెలంగాణలో ఇటీవల "మార్వాడీలు గో బ్యాక్" నినాదాలు కూడా స్థానిక ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటంలో ప్రభుత్వాలు విఫలం కావడమే ప్రధాన కారణం. అలాగే, ప్రభుత్వాలు ఆర్థిక సంస్కరణలు, విద్యా పెట్టుబడులు, సామాజిక సమైక్యత కార్యక్రమాల ద్వారా యువత అసంతుష్టిని పరిష్కరించాలి. జాత్యహంకారాన్ని ఖండించడం, చట్టాలను అమలు చేయడం అవసరం. భారతీయులు ఐర్లాండ్‌లో సురక్షితంగా జీవించాలంటే, సమాజం మొత్తం ద్వేషాన్ని తిరస్కరించాలి. ఇది కేవలం ఐర్లాండ్ యొక్క సవాలు కాదు; అది ప్రపంచ మానవత్వానికి పరీక్ష.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**



# అరుణాచల సాధువుల సాంగత్యం : వివరణ

కామిని కాంచనాల గురించి సాధువుల మధ్య కొంత సంభాషణ జరిగింది. అది మీ ముందు ఉంచడానికి ఒక చిన్న ప్రయత్నం .

అనుకోకుండా నిన్న రమణాశ్రమం వద్ద ఇద్దరు భక్తులను కలవడం జరిగింది. ఒకరు తండ్రి ఇచ్చిన ధనంతో జీవిస్తూ పాతిక సంవత్సరాల నుండి ఇక్కడే ఉంటున్నాడు. మరొకరు మంచి ఉద్యోగం చేస్తూ 30 సంవత్సరాలు నుండి ఇక్కడికి వచ్చిపోతూ ఉన్నాడు. కొంతకాలం క్రితం ఉద్యోగం వదిలేసి ఇక్కడే ఉంటున్నాడు.

ఇద్దరు బ్రహ్మచారులే. ఇద్దరికీ డబ్బు బాగానే ఉన్నది. ఇద్దరికీ వయసు 50 సంవత్సరాల పైనే ఉండవచ్చు. ఎవరి సాధన వారిది. వీరి మీద ఆధారపడిన వారు ఎవరూ లేరనే చెప్పవచ్చు! కానీ ధనంతో జ్ఞానం సాధ్యమా.........!

ఇదే విధముగా కొందరు గృహస్థ భక్తులు దాదాపు 30 సంవత్సరాల నుండి ఇక్కడకు వస్తున్నారు. వీరికి సంసార బంధాలు చాలా వరకు తీరిపోయినట్లే అని చెప్పవచ్చు. ఆ ఉన్న సంపద ఏదో ఇంట్లో వారికి ఇచ్చి, నిశ్చింతగా ఉండవచ్చు. కానీ అలా ఉండరు; ఆస్తిపాస్తులన్నీ తన పేరులోనే ఉండాలి; ధనము కావాలి, జ్ఞానమూ కావాలి; అంతా తన ఆధీనంలోనే ఉండాలి..... ఇది వీరి వరుస..... ఇట్లా ఉన్నవారికి జ్ఞానము సాధ్యమా........ !

**ఇక్కడ మనం ఒక విషయం గమనించాలి :**

సంపన్నుడైన నరేంద్రుని దగ్గర నుంచి భగవంతుడు మొదట ధనాన్ని లాగేసాడు. తద్వారా స్వామీజీ( స్వామి వివేకానంద), శ్రీరామకృష్ణుల కటాక్షంతో..... భిక్షాటన ... భారతదేశ యాత్ర... ఇవి మనకు తెలిసిన విషయాలే.

అంటే సాధువుగానీ, గృహస్థులకుగానీ....... ఆదర్శం వివేకానందుడే అని చెప్పవచ్చు.

అగ్ని (కామం) + నెయ్యి (ధనం) ... కాబట్టి అగ్ని నుండి నెయ్యిని దూరం చేస్తేనే కదా అగ్ని తనంత తానుగా అణగిపోయేది.

అన్నీ వదలి వచ్చిన అన్నామలై స్వామి చేత రమణ మహర్షి రమణాశ్రమం కట్టించాడు. రమణాశ్రమం కట్టే సమయంలో అన్నామలై స్వామి ఇంద్రియ వాంఛల గురించి బాధపడుతూ..... ఈ విషయాన్ని మహర్షికి విన్నవించాడు. అందుకు మహర్షి "ఓ స్వామి! గొప్పగొప్ప వారు కూడా అక్కడే ఇబ్బంది పడ్డారు. పరవాలేదులే...... " అంటూ ఆ ఇంద్రియ వాంఛలను తీసివేశారు. ఆ సమయంలో స్వామి ఆనందానికి అవధులులేవు. చివరకు మహర్షి అనుగ్రహముతో అన్నామలై స్వామి మోక్షం పొందాడు.

అన్నీ పడిపోగా చివరలో పడిపోయేది కామం (ఇంద్రియ వాంఛలు) అని ఇక్కడ సాధువులు అంటూ ఉంటారు. కాబట్టి ఈశ్వర సృష్టి అంత బలంగా ఉంటుంది కదా! దాని మీదనే కదా ఈ సృష్టి అంతా జరుగుతున్నది.

సాధకులు ఎవరైనా (సాధువులు కానీ గృహస్తులు గాని) మొదట ధనం వ్యవహారంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలేమో కదా! సాధకుడు ధనానికి ఎంత దూరంగా వెళ్ళిపోతూ ఉంటే అంతవరకు జ్ఞానమార్గంలో స్థిరపడినట్లేనేమో!

**నమో రమణ**
**రమణజ్యోతి**
**ఎక్స్ ఖాతా నుంచి**



# ఎవరి కోసం "నటన "రాజన్ యాత్ర..

**అధికారంలో ఉన్నారా..?**
**ప్రతి పక్షంలో ఉన్నారా?**

**సికింద్రాబాద్, ఆగస్టు 24 ( జర్నలిస్ట్ డైరీ):** తెలంగాణ రాష్ట్రంలో ప్రజాహిత యాత్ర పేరిట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ చేస్తున్న యాత్ర కేవలం నటన కోసం మాత్రమే అన్నట్లుగా ఉందని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నదా లేదా ప్రతిపక్షంలో ఉన్నదా అని తెలంగాణ ప్రజలు అయోమయంలో ఉన్నారని బీజేపీ రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి విమర్శించారు. మెట్టుగూడ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో మరియు దేశంలోని ఇరవై రాష్ట్రాల పైచిలుకు బీజేపీ అధికారంలో ఉంటే తెలంగాణ రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలో ఉందనుకొని ఊహించి కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నట రాజన్ పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవాచేశారు.ప్రజాహిత యాత్ర అని కాకుండా ఆరు గ్యారంటీలు 420 హామీలతో అధికారంలో వచ్చి అమలు చేయనందుకు ప్రజలు క్షమించాలి అనే పేరుతో యాత్ర చేపడితే బాగుండేదని అన్నారు. మహిళకు తులం బంగారం నెల నెల 2500 వందలు అయిదు వందలకే సిలిండర్ అని మహిళలను మోసం చేసినందుకు మహిళల పక్షాన మీనాక్షి నటరాజన్ తెలంగాణ ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు.యాత్రలో కాంగ్రెస్ నాయకులు యూరియాను నల్ల బజార్ కు తరలిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తూ కేంద్రాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. యూరియా కోసం,రెండు లక్షల రుణమాఫీ కోసం రైతులు కాంగ్రెస్ నాయకులను ప్రజా పాలన ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్నారని అన్నారు.



SV6 NEWS
సమగ్ర సమాచార వారధి
SV6 దైవమ్
ఆధ్యాత్మిక వారధి
24/7 SV6 NEWS
మరియు
ఆధ్యాత్మిక వారధి SV6దైవమ్ యూట్యూబ్
ప్రసారాలు అనునిత్యం మీకోసం



## సింగరేణి ఓసీపీ 1 ప్రాజెక్ట్‌లో సంతాపసభ

**జర్నలిస్ట్ డైరీ**
**యైటింక్లయిన్ కాలనీ(ఆగస్టు 24):**

సింగరేణి రామగుండం మూడవ డివిజన్ ఓసీపీ.1 ప్రాజెక్టులో ఆదివారం ఇటీవలే అనారోగ్యంతో మరణించిన కార్మికుడు వాసుదేవ్ సంతాప సభ జరిగింది. ఐఎన్టియూసి ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో ఉదయం ప్రాజెక్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో పంపు సెక్షన్ కార్మికులు పాల్గొని, వాసుదేవ్ అకాల మరణం పట్ల, చింతిస్తూ.. ఆయన ఆత్మ శాంతికై రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సంతాప సభలో ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ప్రాజెక్టు పిట్ కమిటీ కార్యదర్శి గునుగంటి వెంకటస్వామి, నాయకులు జక్కుల చంద్రయ్య, గంధం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అభిమాన కామ్రేడ్‌కు కమ్యూనిస్టుల నివాళి

**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలనీ(ఆగస్టు 24):** స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం, మాజీ ఎంపీ, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ జరిగింది. యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి శాంసంగ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర కమిటీ ఉపాధ్యాక్షులు ఎల్. ప్రకాష్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, సీపీఐ మండల కార్యదర్శి కందుకూరి రాజారత్నం ముఖ్య అతిథులుగా పాల్గొని, స్థానిక నాయకులతో కలిసి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిగురు రవీందర్, గంధం సాంబశివరావు, బుర్ర తిరుపతి, కొండ్ర సత్యనారాయణ, సెగ్గం శంకర్, మహేందర్, చిట్టంపల్లి కుమార స్వామి, ఆంజనేయులు, పోశం, సారా శ్రీనివాస్, రాజేందర్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.






## శ్రేష్ఠ ఇంటీరియల్స్ షాప్ ని ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే

**కాప్రా,ఆగష్టు 24(జర్నలిస్ట్ డైరీ):** డాక్టర్ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ పద్మశాలి టౌన్షిప్ లో ఆదివారం నూతనంగా కె ఎన్ ప్రసాద్ నూతనంగా ప్రారంభించిన శ్రేష్ఠ ఇంటీరియల్స్ షాప్ ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధారణంగా రబ్బర్ ఫ్లోరింగ్ అనేవి జిమ్లు,క్రీడా మైదానాలలో వినియోగిస్తుంటారు. అయితే ఇప్పుడు ఇళ్లలోనూ ఈ తరహా ఫ్లోరింగ్ను కొనుగోలుదారులు ఇష్టపడుతున్నారు.ప్రత్యేకించి పిల్లల గదులలో రబ్బర్ ఫ్లోరింగ్ను వేయిస్తున్నాయి.పై అంతస్తులో పిల్లలు ఆడుకుంటే కిందికి శబ్దాలు వినిపించకుండా,కిందపడినా దెబ్బలు తగలకుండా ఉండేందుకు ఈ రబ్బర్ ఫ్లోరింగ్ను ఎంపిక చేస్తున్నారు.తడిగా ఉంచే కిచెన్, బాత్రూమ్ వంటి ప్రాంతాలలో కూడా వీటిని వేసుకోవచ్చు.రబ్బర్ ఫ్లోరింగ్ ఉత్పత్తులు మ్యాట్స్, టైల్స్, రోల్స్ రూపంలో,విభిన్న శైలి రంగులలో,డిజైన్లలో లభ్యమవుతాయి.వీటికి దీర్ఘకాలం మన్నిక ఉంటుంది. సరిగ్గా నిర్వహణ చేస్తే 20 ఏళ్ల కంటే ఎక్కువ కాలం మన్నుతాయి. ఇతర ఫ్లోరింగ్లతో పోలిస్తే చిరిగిపోవటం, పాడైపోవటం వంటివి చాలా తక్కువ.ఫంగస్ కూడా పట్టదు అని తెలిపారు. శ్రేష్ఠ ప్రాపర్టీస్ అండ్ ఇంటీరియర్స్ ఆఫీస్ ప్రారంభోత్సవానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకుడు రేగళ్ల సతీష్ రెడ్డి,నిరంజన్ దాస్,శేఖర్ చారి,సాగర్,కే శ్రీనివాసరావు,కే. ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.



## పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక

**వలిగొండ,ఆగష్టు 24(జర్నలిస్ట్ డైరీ):** యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల కేంద్రంలో నూతన పద్మశాలి సంఘం పట్టణ కమిటీని ఆదివారం సాయిగణేష్ ఫంక్షన్ హాల్లో పద్మశాలి కులస్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సాయిని యాదగిరి,అధ్యక్షులుగా గంజి వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు దొంత శ్యామ్ సుందర్,కందగట్ల వెంకటేశం. ప్రధాన కార్యదర్శి రచ్చ సంతోష్, కోశాధికారి నామాల జగన్మోహన్, సహాయ కార్యదర్శి ఎక్కలదేవి శ్రీనివాస్, సంస్కృతిక కార్యదర్శి యలగందుల లెనిన్, డైరెక్టర్లు పెండెం విగ్నేష్,గంజి ఉపేందర్,గర్దాస్ మనోహర్, బడుగు లింగస్వామి ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్షులు గంజి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన కుల పెద్దలందరికీ కృతజ్ఞతలు జేస్తూ,

నాకు ఇచ్చిన బాధ్యతను నిస్వార్థంగా,సమర్థవంతంగా నిర్వహిస్తానని వలిగొండ పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బడుగు సత్యనారాయణ గంజి నారాయణ దొంత శంకరయ్య జెల్ల నరేందర్, ఐటిపాముల కుమార్,ఐటి పాముల ప్రభాకర్,ఐటిపాముల రవీంద్ర,గంజి బాలనరసింహ, కూరపాటి భూమయ్య రాపోలు సుధాకర్,గుంటి రవీందర్,పున్న ఆంజనేయులు,బోడ కుమారు, మిర్యాల భాస్కరు,మిర్యాల వెంకటేశం,రాపోలు శ్రీను,వంగరి రమేష్ మిరియాల శీను మరియు పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

# డీజే సంస్కృతిని విడనాడండి.. స్థానిక కళాకారులను ప్రోత్సహించండి!

- గణేశ్ మండపాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోండి
- ప్రశాంతంగా, ఉత్సాహంగా పండుగ జరుపుకుందాం
- మీ అందరి కోసమే మేమంతా ఉన్నాం
- గణేశ్ నవరాత్రుల సన్నాహక సమావేశంలో ఎల్బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య

**జర్నలిస్ట్ డైరీ, ఎల్బీ నగర్(ఆగస్ట్ 24):** అర్ధరాత్రి వరకు డీజే సౌండ్స్‌తో చుట్టు పక్కల వారికి ఇబ్బందులు కలిగించకండి, ఆ సంస్కృతిని పక్కన పెట్టి, స్థానిక కళాకారులను ప్రోత్సహించండని గణేశ్ మండపాల నిర్వాహకులకు ఎల్బీ నగర్ ఏసీపీ ఎ. కృష్ణయ్య సూచించారు. ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గణేశ్ నవరాత్రుల సన్నాహక సమావేశం ఆదివారం కుషాల్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వార ఎలాంటి అవాంఛనీయ ఘటన జరిగినా వెంటనే చర్యలు తీసుకోవడానికి ఉపయోకరంగా ఉంటుందని తెలిపారు. మండపాల పేరుతో ఎలాంటి లక్కీ డ్రాలు, జూదాన్ని నిర్వహించరాదన్నారు. అలాగే బలవంతంగా చందాలు వసూలు చేయరాదని సూచించారు. ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించకూడదని, తప్పని సరిగా విద్యుత్ శాఖ వారి అనుమతి తీసుకోవాలన్నారు. అయితే ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మండపాలకు నాణ్యమైన వైర్లను, పరికరాలను వినియోగించి విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలన్నారు. అలాగే ట్రాఫిక్‌కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాల చుట్టుపక్కల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం వెళ్లే దారులను కూడా ఇప్పటి నుంచే ప్లాన్ చేసుకుని దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బందులు కలగాకుండా ఉండేలాగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే డయాల్ 100, కమీషనరేట్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలన్నారు. ప్రతి ఆరు మండపాలకు ఒక కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశామని, ఆయా మండపాల నిర్వాహకులు వారితో టచ్‌లో ఉండాలన్నారు. సోషల్ మీడియాల్లో అసత్య ప్రచారాలు చేసి, మత ఘర్షణలకు, లా అండ్ ఆర్డర్ సమస్యకు కారణం అయితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. డీజే సంస్కృతిని విడనాడి, స్థానిక కళాకారులను ప్రోత్సహించేలా కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల సమీపంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.





గణేశ్ పండుగ అందరిదీ అని, అందరం కలిసి ప్రశాంతంగా, ఉత్సాహవంతంగా జరుపుకుందామని, పోలీసులకు అందరూ సహకరించాలన్నారు. ఈ సన్నాహక సమావేశం ఎల్బీ నగర్ సీఐ కె.వినోద్ ఆధ్వర్యంలో జరగగా, డీఐ, పలు సెక్టార్ల ఎస్‌ఐలు హాజరై, తమ అమూల్యమైన సూచనలు చేశారు. పండుగ తొమ్మిది రోజులు కాలనీల కమిటీలను, యువతను అలర్ట్‌గా ఉండాలని కోరారు. ఎప్పటికప్పుడు సహకారం అందిస్తామని, నవరాత్రులను దిగ్విజయంగా పూర్తి చేయాలని అభిలషించారు.



## రక్త దానానికి మించిన సమాజ సేవ మరొకటి లేదు.

**టీడీపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడె వెంకట పట్టాభిరామ్.**

**విశాఖపట్నం,ఆగష్టు 24(జర్నలిస్ట్ డైరీ):** ప్రస్తుత సమాజంలో రక్త దానానికి మించిన సమాజ సేవ మరొకటి లేదని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడె వెంకట పట్టాభిరామ్ పేర్కొన్నారు. ఆదివారం జరిగిన మదర్ థెరీసా జయంతి సందర్భంగా నగరంలోని 19వ వార్డు పెద జాలారి పేటలో ప్రముఖ సంఘ సేవకులు ఒలిశెట్టి గురునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 70వ మహా రక్త దాన శిబిరానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి దూత మదర్ థెరీసా జయంతి వేడుకల సందర్భంగా ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన సంఘ సేవకులు ఒలిశెట్టి గురునాథ్ ను ఆయన అభినందించారు. పెదజాలరిపేట రామాలయం కల్యాణ మండపం వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తం దానం చేశారు. ఒలిశెట్టి సత్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరం విజయవంతమైందని గురునాథ్ తెలిపారు. రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అని, నేత్రదానం చేయండి మరోసారి జీవించండి అంటూ నినదించారు. 1999 నుంచి ఇప్పటి వరకు తాను 92సార్లు రక్తదానం చేశానని, 2007 నుంచి ఇప్పటి వరకు 70రక్తదాన శిబిరాలు నిర్వహించానని ఆయన అందరి హర్ష ధ్వనాల మధ్య గుర్తు చేశారు. సుమారు 70వేల మందికి అత్యవసరంలో రక్తాన్ని సమకూర్చానని తెలిపారు.ఈ కార్యక్రమానికి త్రీటౌన్ సీఐ పైడయ్య,తదితరులు హాజరై గురునాథ్ సేవల్ని అభినందించారు.

## హిందూ దేవాలయ ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం.




**రాధా మనోహర్ దాస్ స్వామీజీ.**


**విశాఖపట్నం,ఆగష్టు 24(జర్నలిస్ట్ డైరీ):** హిందూ దేవాలయల ఆస్తులు పరిరక్షణే ధ్యేయంగా ,హిందూ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తామని,రాధా మనోహర్ దాస్ స్వామీజీ అన్నారు. స్థానిక విజయఫ్లో విలేకరుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మనోహర్ దాస్ స్వామీజీ మాట్లాడుతూ, భరతమాత ఒడిలో హిందూ ధర్మంపై ఆధారపడి జీవిస్తున్నామని, హిందూ సాంప్రదాయ సంస్కృతులను కాపాడవలసిన బాధ్యత ఆంధ్రపై ఉందన్నారు. భారతదేశానికి స్వాతంత్రం ఇచ్చి వెళ్లిపోయినప్పటికీ వాళ్ళ వారసులు కొంతమంది ఇక్కడ ఉన్నారని, వారు భరత జాతిని ఛీల్చడానికి, సంపదను కొల్లగొట్టడానికి కుయుక్తులు చేస్తున్నందున, ఇప్పటికీ భారత దేశంలో ఉన్న హిందువులు అభివృద్ధి చెందలేదని వివరించారు. అన్యమత ఉద్యోగులను అధికారులను గుర్తించి తొలగించడంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఉదాసినత వ్యవహరిస్తున్నారన్నారు. హిందూ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని వాటిని హిందూ న్యాయవాదుల సంఘం ఎదుర్కొంటుందని తెలిపారు. దేవాలయాల, ఎండోమెంట్ పరిధిలో ఉన్న ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఆయా ఆస్తిల పై అధికార పార్టీ పెత్తనం చలా ఇస్తుందన్నారు. న్యాయవాది జి శ్రీకృష్ణ కుమార్ మాట్లాడుతూ, హిందూ న్యాయవాదులను ఏకతాటిపై తీసుకురావాలని ఉద్దేశంతో 14 మంది స్వామీజీలు, సంకల్పించారని తెలిపారు. ప్రతి జిల్లాలో హిందూ దేవాలయాల ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఉదాహరణకు విశాఖలో ఉన్న శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆస్తులు ఎన్ని?అన్యాక్రాంతం అయ్యాయిన ఆస్తులు ఎన్ని?, దీనిపై సమగ్రమైన న్యాయ విచారణ జరగాలని అన్నారు. వీలైతే హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు తీసుకెళ్లి అన్యాక్రాంతమైన ఆస్తులను స్వాధీనం చేసుకునే విధంగా దృష్టి సారిస్తామన్నారు. హిందూ న్యాయవాదుల సంఘం ఏర్పాటు చేయడం పట్ల హిందూ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొల్లూరి రవి శంకర్, డి ఉమా రాజ్యలక్ష్మి,వినోద్ కుమార్,కే సుబ్రహ్మణ్యం,వి సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# ఎవరు చూస్తే మాకేంటి?

- ఎల్బీ నగర్ పీఎస్ సమీపంలో బహిరంగ మూత్ర విసర్జన
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట

**జర్నలిస్ట్ డైరీ, ఎల్బీ నగర్ (ఆగస్ట్ 24):** ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ సమీపంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనపడుతోంది. పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఫ్లై అండర్ పాస్ బ్రిడ్జ్ మీద మూత్ర విసర్జన చేసేవాళ్లు ఒకవైపు.. పీఎస్‌కు ఎదురుగా చెత్త వేసే వాళ్లు మరోవైపు. ఏ మాత్రం బాధ్యతలేని పౌరులను నిందించాలా, లేక సరైన పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయని అధికారులను అనాలా అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నిత్యం వేల మంది ఎల్బీ నగర్ సర్కిల్‌లో ప్రయాణాలు సాగిస్తుంటారు. ఎల్బీ నగర్ నుంచి ఉప్పల్ వెళ్లే బస్సులకు సమీపంలో, ఆ ఫ్లై ఓవర్ మీద మూత్ర విసర్జనకు వెళ్లే వారికి లెక్కే లేదు. ఏమాత్రం సంకోచం లేకుండా, జనం చూస్తారన్న సెన్స్ లేకుండా పలువురు తమ పని కానిచ్చేస్తున్నారు. పక్కనే బస్ స్టాప్ కావడంతో మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేగాక ఆవైపుగా నడవాలంటే ముక్కు మూసుకు వెళ్లాల్సిందేనని, లేకపోతే ఇక అంతే సంగతులంటున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తినా.. ఎలాంటి పరిష్కారం లేదని పలువురు విమర్శిస్తున్నారు.








## డాక్టరేట్ పొందిన మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ ను సత్కరించిన సాహితీ కళావేదిక సభ్యులు,ప్రజా సంఘాలు.

**వనపర్తి,ఆగష్టు 24 (జర్నలిస్ట్ డైరీ):** ఇటీవల సామాజిక సేవ రంగంలో స్వచ్ఛంద సంస్థ చే డాక్టరేట్ పొందిన సతీష్ యాదవ్ ను సాహితీ కళావేదిక సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు ఆదివారం వనపర్తిలో ఆయన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా కళాకారులు వారు కవితలు చెబుతూ పాటలు పాడుతూ , సతీష్ యాదవ్ ను అభినందించారు. రాబోవు కాలంలో అందరం కలిసి వనపర్తి జిల్లా సమాజ అభివృద్ధి చేద్దామని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళావేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్,కవి బై రోజు చంద్రశేఖర్,ఉపాధ్యాయుడు డాక్టరేట్ కంటీ నిరంజనయ్యా, వనపర్తి గద్దర్ రాజారామ్ ప్రకాష్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కవి సత్తార్, బహుజన వేదిక అధ్యక్షుడు గంధం నాగరాజు,జై భీమ్ సేన అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు డి రాములు, ఉపాధ్యాయుడు రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





## సురవరం కు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఘన నివాళి.

**వనపర్తి ప్రతినిధి,ఆగష్టు 24 (జర్నలిస్ట్ డైరీ):** సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పుష్పగుచ్ఛం వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన భార్య విజయలక్ష్మి, కుమారుడిని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ న్యాయం కోసం, ఆత్మగౌరవం కోసం సురవరం సుధాకర్ రెడ్డి ఉద్యమ జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. పాలమూరు జిల్లాలో పుట్టి జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులు గడించిన సుధాకర్ రెడ్డి మన మధ్య లేకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు.

## భారీ కొండచిలువ పట్టివేత.

**స్నేక్ క్యాచర్ కృష్ణ సాగర్**

**పెద్దమందడి,ఆగష్టు 24(జర్నలిస్ట్ డైరీ):** మండల పరిధిలోని దొడగుంటపల్లి గ్రామ సమీపంలో గల సోలార్ పవర్ ప్లాంట్ లో భారీ కొండచిలువను పట్టుకున్నట్లు సాగర్ స్నేక్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు (స్నేక్ క్యాచర్) కృష్ణ సాగర్ తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ లో శనివారం భారీ కొండచిలువ కనబడడంతో సెక్యూరిటీ సిబ్బంది వెంటనే పవర్ ప్రాజెక్టు మేనేజర్ వసంతరావుకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే వనపర్తిలోని సాగర్ స్నేక్స్ సొసైటీ అధ్యక్షులు కృష్ణసాగర్ కు సమాచారం ఇవ్వగా ఆయన వెంటనే అక్కడికి చేరుకొని భారీ కొండచిలువను అతి కష్టం మీద బంధించి ఖిల్లా ఘనపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మంజులకు సమాచారం ఇచ్చారు. ఆమెతోపాటు మరొకరు అటవీ శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పామును బలిజపల్లి, జంగమయ్యపల్లి అటవీ ప్రాంతంలో సురక్షిత ప్రాంతంలో వదిలిపెట్టారు. అనంత రం కృష్ణసాగర్ మాట్లాడుతూ వర్షాలు బాగా కురుస్తున్నందువల్ల పాములు మైదాన ప్రాంతాలకు వస్తున్నాయని అలాగే సమీపంలో అటవీ ప్రాంతం ఉండడం వల్ల అడవి పందులు, కుందేళ్లు, ఇతర జంతువులను వేటాడి తినేందుకు కొండచిలువలు బయటకు వస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేటప్పుడు చాలా జాగ్రత్తగా గమనిస్తూ తమ పనులు చేసుకోవాలని సూచించారు. పాములు కనిపిస్తే వాటిని చంపకుండా తమకు సమాచారం ఇస్తే వెంటనే వచ్చి పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలిపెడతానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చిలుక కుమార్, అవినాష్,ఫారెస్ట్ సిబ్బంది వంశీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఫర్నిచర్ గోడౌన్ లో భారీ అగ్నిప్రమాదం



**రాజేంద్రనగర్ ఆగష్టు 24(జర్నలిస్ట్ డైరీ):** కాటేదాన్ పారిశ్రామిక వాడలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పారిశ్రామిక వాడలో ఓ వ్యక్తి సలీం ప్లై వుడ్ ఫర్నిచర్ పేరుతో గోడౌన్ ఏర్పాటు చేశాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో మధ్యాహ్నం వరకు గోడౌన్ లోనే ఉండి యజమాని ఇంటికి వెళ్లిపోయాడు. గోడౌన్ లో మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో స్థానికులు.. పోలీసులకు, అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు.పెద్ద ఎత్తున ఎగిసి పడుతున్న మంటలతో.. సమీప ప్రాంతాలకు భారీగా పొగ వ్యాపించింది. ఆ క్రమంలో స్థానికులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు.మూడు అగ్నిమాపక వాహనాలు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని గోడౌన్ లో ఉన్న లక్షల విలువైన సామాగ్రి కాలీ బూడిదైనట్లు పోలీసులు తెలిపారు. అగ్ని ప్రమాదం ఎలా సంభవించిందనే అంశంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. అందులో భాగంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆదివారం క్లాసులు బోధిస్తున్న శ్రీ చైతన్య స్కూల్.. తనిఖీ చేసిన ఎంఈఓ

**సంగారెడ్డి ఆగష్టు 24(జర్నలిస్ట్ డైరీ):** విద్యార్థులకు ఆదివారం వచ్చిందంటే చాలు సెలవు వస్తుందని ఎగిరి గంతేస్తారు. ఒక్కరోజైనా ప్రశాంతంగా ఆటలు ఆడుకుంటామని విద్యార్థులు భావిస్తారు. అలాంటి సండే పూట క్లాస్ నిర్వహించి విద్యార్థులను పాఠశాలకు రప్పిస్తుంది సంగారెడ్డిలోని శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లిలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు ఆదివారం క్లాసులు బోదిస్తున్నారు. సెలవు రోజు పాఠాలు చెప్పడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం విద్యార్థులకు క్లాస్ లు చేపడుతున్న విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు పాఠశాలకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. సండే పాఠాలు చెప్పడంపై ఫోన్ లో ఎంఈఓకు ఫిర్యాదు చేయగా సంగారెడ్డి ఎంఈఓ విద్యాసాగర్ పాఠశాలకు చేరుకుని పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల డీన్ మహేష్ ను వివరణ కోరగా గణేష్ మండపం ఏర్పాటు కోసం విద్యార్థులు వచ్చారని పొంతనలేని సమాధానాలు చెప్పారు. గత కొన్ని రోజులుగా వర్షాలు పడి క్లాస్ లు నడవకపోవడంతో ఆదివారం క్లాస్ లు నిర్వహిస్తున్నామని అన్నారు. ఆందోళన నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సెలవు ఖచ్చితంగా ఇవ్వాల్సిందేనని హెచ్చరించారు. సండే క్లాస్ లు నిర్వహిస్తే తనకు చెప్పాలని విద్యార్థులకు తన ఫోన్ నంబర్ ఇచ్చారు.

**శ్రీచైతన్య స్కూల్ కు మోమో జారీ చేస్తాం: సంగారెడ్డి ఎంఈఓ విద్యాసాగర్**

సండే క్లాస్ లు బోదిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ కు మోమోలు జారీ చేస్తాం. ఆదివారం క్లాసులు నిర్వహించకూడదు. పాఠశాలను పరిశీలించగా నిజంగానే విద్యార్థులకు క్లాస్ రూముల్లో పాఠాలు బోధిస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల కు తెలిపి చర్యలు తీసుకుంటాం.

**పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్**

ఆదివారం సెలవు రోజున శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు క్లాస్ లు భోదిస్తున్నది. సెలవు రోజు పాఠాలు చెబుతున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి. పాఠశాలలకు తప్పనిసరిగా సెలవు ఇవ్వాల్సిందే. సెలవు రోజుల్లో క్లాస్ లు నిర్వహిస్తే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.



# విశాఖపట్నంలో ఒబెన్ ఎలక్ట్రిక్ విస్తరణ, జాతీయస్థాయిలో 50 షోరూమ్‌లను దాటింది

**ఒబెన్ ఎలక్ట్రిక్ ప్రస్తుతానికి 15 రాష్ట్రాలలో మరియు 37 నగరాలలో ఉన్నది**

**విశాఖపట్నం,ఆగష్టు 24(జర్నలిస్ట్ డైరీ):** R & D ఆధారిత స్వదేశీ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ తయారీ సంస్థ అయిన ఒబెన్ ఎలక్ట్రిక్, ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నంలో తన 50వ షోరూమ్ మరియు సర్వీస్ సెంటర్ను ప్రారంభించడం ద్వారా గణనీయమైన మైలురాయిని సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశవ్యాప్తంగా 150 షోరూమ్లు మరియు సర్వీస్ సెంటర్లను దాటాలనే సంస్థ యొక్క ప్రతిష్టాత్మక దృష్టిని ఈ విస్తరణ నొక్కి చెబుతుంది.

ఈ సంస్థ ఇటీవల విశాఖపట్నం మరియు గుంటూరు (ఆంధ్రప్రదేశ్), రాంచీ (జార్ఖండ్), జబల్పూర్ (మధ్యప్రదేశ్), అలీఘర్ మరియు ఉన్నావ్ (ఉత్తరప్రదేశ్) మరియు పాలక్కాడ్ (కేరళ)లలో 15 రాష్ట్రాలు మరియు 37 నగరాల్లో తన ఉనికిని బలోపేతం చేసుకుంది. ఆధునిక భారతీయ రైడర్ల కోసం రూపొందించిన ఒబెన్ ఎలక్ట్రిక్ యొక్క తదుపరి తరం కమ్యూటర్ మోటార్ సైకిల్ అయిన రోర్ EZ మరియు కొత్తగా ప్రారంభించిన రోర్ EZ సిగ్మా కోసం బలమైన మార్కెట్ డిమాండ్ కారణంగా ఈ వేగవంతమైన విస్తరణ ముందుకు సాగుతోంది. రోర్ EZ సిగ్మా, రోర్ EZ విజయంపై ఆధారపడి, రోజువారీ ప్రయాణానికి మెరుగైన పనితీరు, అధునాతన సాంకేతికత మరియు ఎక్కువ ఆచరణాత్మకతను అందిస్తుంది, ఇది ఒబెన్ ఎలక్ట్రిక్ యొక్క దేశవ్యాప్త పాదముద్రకు కీలకమైన వృద్ధి డ్రైవర్‌గా నిలిచింది.

ఈ మైలురాయి గురించి మాట్లాడుతూ, ఒబెన్ ఎలక్ట్రిక్ వ్యవస్థాపకురాలు మరియు CEO శ్రీమతి మధుమితా అగ్రవాల్ మాట్లాడుతూ, "మా 50వ డీలర్షిప్ భారతదేశం అంతటా ఎలక్ట్రిక్ మొబిలిటీని అందుబాటులోకి తీసుకురావాలనే ఒబెన్ ఎలక్ట్రిక్ దృష్టి వైపు బలమైన అడుగు. ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛమైన చలనశీలతను పెంపొందించడంపై దృష్టి సారించి, మాకు ఒక ముఖ్యమైన మార్కెట్, మరియు మా కొత్త విశాఖపట్నం షోరూమ్ తో ఈ పురోగతికి తోడ్పడటం గర్వంగా ఉంది. అంతర్గత తయారీ, అధికపనితీరు ఉత్పత్తులు మరియు కస్టమర్ అనుభవంపై లోతైన దృష్టితో, భారతదేశంలో మరియు వెలుపల ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ యాజమాన్యం కోసం కొత్త బెంచ్‌మార్క్‌లను ఏర్పాటు చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము." అన్నారు.

అధికపనితీరు గల LFP బ్యాటరీలు, మోటార్లు, ఛార్జర్లు మరియు వాహన నియంత్రణ యూనిట్లతో సహా అన్ని క్లిష్టమైన EV భాగాలను పూర్తిగా నిలువుగా అనుసంధానించి, రూపకల్పన చేసి, దేశీయంగా తయారు చేసే అతికొద్ది భారతీయ EV కంపెనీలలో ఒబెన్ ఎలక్ట్రిక్ ఒకటి. ఈ సామర్థ్యం భారతదేశం యొక్క విభిన్న రైడింగ్ పరిస్థితులకు అనుగుణంగా స్థిరమైన నాణ్యత, మన్నిక మరియు పనితీరును నిర్ధారిస్తుంది.

విశాఖపట్నం షోరూమ్ ప్రారంభంతో, ఒబెన్ ఎలక్ట్రిక్ ఈ ఆర్థిక సంవత్సరం నాటికి 150+ అవుట్లెట్లబలమైన జాతీయ నెట్‌వర్క్‌ను నిర్మించాలనే తన లక్ష్యానికి దగ్గరగా వెళ్తుతోంది, ప్రతి షోరూమ్కు అంకితమైన సేవా కేంద్రాలు మరియు బలమైన కస్టమర్ మద్దతు ఉంటుంది.





గణేష్ చతుర్థి పండుగ నెలను జరుపుకోవడానికి, ఒబెన్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను కొనుగోలు చేసే వినియోగదారులకు ఖచ్చితంగా బంగారు నాణెం లభిస్తుంది, ఈ ఆఫర్ 15 సెప్టెంబర్ 2025 వరకు చెల్లుతుంది.




## మోసం చేసిన సర్కారు.. తాడోపేడో తెల్చుకుందాం: మందకృష్ణ మాదిగ

**జహీరాబాద్ఆగష్టు 24(జర్నలిస్ట్ డైరీ)** రాష్ట్రంలోని 50 లక్షల పెన్షనర్లకు 20 నెలలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. అధికారం చేపట్టి 20 నెలలవుతున్న ఇచ్చిన హామీ అమలు చేయకుండా పెన్షనర్లను మోసం చేస్తున్న ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుందామని ఆయన హెచ్చరించారు. సెప్టెంబర్ 9న హైదరాబాదులో నిర్వహించ పెన్షనర్ల బహిరంగ సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన పెన్షనర్ల బహిరంగ నియోజకవర్గ సన్నాహక సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 20 నెలల నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ, పెన్షన్ల పెంపు, రేషన్ బియ్యం పెంపు తదితర సంక్షేమ పథకాల కోసం తాను చేసిన పోరాటం, దాని నేపథ్యాలను పేపర్, ఆడియో క్లిప్పింగ్స్ లతో సభకు వివరించి తన పోరాటపటిమను వివరించారు. విపక్షాల అసమర్థత, అధికార కరపక్షం నిర్లక్ష్యంతో పేదల సమస్యలు గుర్తు రావని, హామీలను పట్టించుకోరని మండిపడ్డారు. తను ఎప్పుడూ.. అణగారిన వర్గాల పక్షంలోనే పోరాడుతానన్నారు. ఇక్కడ అన్ని వర్గాల వారికి సేవ చేసే అవకాశం తనకు కలుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ అందరికీ భరోసానిచ్చే బ్రాండ్ అని స్పష్టం చేశారు. ప్రభుత్వం పెన్షనర్ల పట్ల చేస్తున్న మోసాన్ని ఎండగట్టేందుకే బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తున్నామన్నారు. వికలాంగులకు రూ.6000తో పాటు వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులు ఇతర పెన్షన్లన్ని డబుల్ చేసేంతవరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా వికలాంగులు, పెన్షనర్లందరూ భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా విపక్ష పార్టీ నేతలు, పనులు, పెన్షనర్లు మందకృష్ణ మాదిగను మాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, ఎమ్మార్పీఎస్, పెన్షనర్లు సంఘం నేతలు అబ్రహం మాదిగ ఉల్లాస్ మాదిగ జయరాజ్, నర్సింలు, రామరవి కిరణ్, జ్యోతి, నారాయణ, విశ్వనాథ్ యాదవ్, జైరాజ్ మాదిగ, మైకల్ మాదిగ, రవికుమార్, నిర్మల్ మాదిగ, రాజు, మనోజ్, నగేష్, యేసప్ప, రాజేందర్, సింగితం రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మూడు సార్లు మూసి వద్దకు వెళ్లి శరీర భాగాలు పడేసి..



**మేడిపల్లి ఆగష్టు 24(జర్నలిస్ట్ డైరీ):** భర్త భార్యను చంపాడు కానీ అతి కిరాతకంగా చంపాడని మల్కాజిగిరి డీసీపీ పద్మజా రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్వాతి హత్య కేసుకి సంబంధించిన వివరాలు మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలియజేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా, కామారెడ్డి గూడా కి చెందిన స్వాతి, మహేంద్ రెడ్డి ఇద్దరు లవ్ మ్యారేజ్ చేసుకున్నారు. పెళ్లి అయిన తర్వాత ఇద్దరు మధ్య నాలుగు సార్లు గొడవలు జరిగాయి. ఒక సంవత్సరం క్రితం అమ్మాయి కి అబార్షన్ కూడా చేయించాడు. అమ్మాయి మళ్ళీ గర్భవతి అయింది. ఈ నెల 27 న మెడికల్ చెకప్ తర్వాత ఇంటకి వెళ్తా అనగానే ఇద్దరి మధ్యా గొడవ స్టార్ట్ అవ్వగా ఆమెను కొట్టాడు. శనివారం ఉదయం బయటకు వెళ్లిన మహేందర్ రెడ్డి సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత ఆమెను కొట్టగా కళ్ళు తిరిగి కోమాలో పోయింది. ఆ తర్వాత గొంతు నులిమి స్వాతిని చంపేశాడు. బోడుప్పల్ లో హార్డ్ వేర్ షాప్ లో యాక్సెస్ బ్లెడ్ ముందుగానే కొనుగోలు చేసి తెచ్చుకుని ఆమె తల, కాళ్ళు చేతులు మొండెం నుండి వేరు చేసి మూడు సార్లు మూసి వద్దకు వెళ్లి శరీర భాగాలు పడేసాడు. ఆ తర్వాత తన భార్య కనబడటం లేదని మహేందర్ తన చెల్లికి ఫోన్ చేసి చెప్పాడు.మహేందర్ చెల్లి భర్త నరేందర్ రెడ్డి కి అనుమానం కలిగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మహేందర్ బంధువు ఇచ్చిన ఇన్ఫర్మేషన్ తో మహేందర్ రెడ్డి నీ అరెస్ట్ చేశామని, ఘటన జరిగిన స్థలంలో పలు ఆధారాలు సేకరించామని, స్వాధీనం చేసుకున్నది స్వాతి బాడినా లేదా ఇతర మరో మహిళనా అని నిర్ధారనికి డిఎన్ఎ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. గతంలో గొడవలు విషయంలో వికారాబాద్ సొంత గ్రామంలో 498 కింద కేసు నమోదు అయిందని, పెద్దల సమక్షంలో గొడవ రాజీ కుదిరింది. ఆపై హైదరాబాద్ కు వచ్చారు. మహేందర్ రెడ్డి రాపిడో డ్రైవర్ గా పని చేస్తున్నాడు. గతంలో అమ్మాయి కాల్ సెంటర్లో పనిచేసేదని తరచుగా ఫోన్ మాట్లాడుతుంటే అనుమానం గొడవలు వచ్చేవని, కేసును అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని నిందితున్ని రిమాండ్ కు తరలిస్తామని అన్నారు.కేసుకి సంబందించిన పలు ఏవిడెన్స్ సేకరించినందుకు ఏసీపీ చక్రపాణి, మేడిపల్లి సీఐ గోవింద రెడ్డిని అభినందించారు.

## ఆగస్ట్ 9న చలో హైద్రాబాద్ (పరేడ్ గ్రౌండ్)వికలాంగుల, చేయూత పెన్షన్ దారుల మహా గర్జన..

**వికలాంగుల పెన్షన్ 6వేలకి, వృద్ధుల,వితంతువుల, ఒంటరి మహిళల పెన్షన్లు 4వేలకి పెంచాలి..**

**పరిగి ఆగష్టు 24(జర్నలిస్ట్ డైరీ):** ఆదివారం ఎమ్మార్పీఎస్,ఎం ఎస్ పి వికారాబాద్ జిల్లా సమావేశం పరిగి నియోజకవర్గ కేంద్రంలోని శారద ఫంక్షన్ హాల్ లో పరిగి ఇంచార్జి గుట్టకింది రవి కుమార్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశనికి ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా ఇంచార్జిలు దుద్దు రామకృష్ణమాదిగ, గట్టగల్ల ప్రశాంత్ మాదిగ, ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ, హాజరై నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఎలక్షన్ టైమ్ లో ఇచ్చిన హామీ వికలాంగులకు 6వేలు, వృద్ధులకు, వితంతువులకు, చేయూత పెన్షన్ దారులకు 4వేలు పెన్షన్ వెంటనే పెంచాలనీ డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20నెలలు గడిచిన ఇంకా పెన్షన్ హామీ ఇంకా నెరవేర్చలేదు అని అన్నారు..వికలాంగుల,చేయూత పెన్షన్ దారుల పెన్షన్ వెంటనే పెంచాలనీ డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో లక్షలాది మందితో వికలాంగుల, వృద్ధుల, వితంతువుల, వితంతువుల, మహా గర్జన సభను నిర్వహించనున్నారని తెలిపారు, వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు నియోజకవర్గల వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆ మహా గర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్, జిల్లా కార్యదర్శి ఆర్,అంజి మాదిగ, ఎం ఎం ఎస్ జిల్లా కన్వీనర్ శివాజీ మాదిగ, పూడూరు మండలం ఇంచార్జి చిడిగిద్ద కిష్టన్న మాదిగ, ఎం ఎస్ పి జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ, జిల్లా కార్యదర్శి దప్పు మహేందర్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి గజ్జల ప్రకాష్ మాదిగ, మహిళా జిల్లా నాయకులరాలు పుష్ప రాణి మాదిగ, సునీత, చేయూత పెన్షన్ దారుల జిల్లా అధ్యక్షురాలు మంజుల, మహిళా నాయకురాలు పద్మమ్మ,యాలాల్ మండల అధ్యక్షుడు సూర్య ప్రకాష్ మాదిగ, తాండూర్ టౌన్ అధ్యక్షుడు బలరామ్ మాదిగ, పరిగి నాయకులు రమేష్ మాదిగ ఉప అధ్యక్షుడు రవి కుమార్ మాదిగ, పూడూరు మండల అధ్యక్షుడు యేసు మాదిగ, యాదమ్మ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సై అరాచకం.. లంచం ఇవ్వలేదని రక్తం వచ్చేలా..



**జనగామ ఆగష్టు 24(జర్నలిస్ట్ డైరీ):** జఫర్ఘడ్ ఎస్సై రామ్ చరణ్ నాయక్ అరాచకానికి పాల్పడ్డాడు. తనకు లంచం ఇచ్చేందుకు నిరాకరించిన వ్యక్తిని రక్తం వచ్చేలా చితకబాదించాడు. చిన్నపాటి గొడవను ఆపిన ఉమర్ అనే వ్యక్తిపై ఎస్సై కేసు పెట్టాడు. రూ.10 వేలు లంచం ఇస్తే కేసు తీసేస్తామని బెదిరించాడు. తాను చెప్పులు అమ్ముకునే వ్యక్తినని.. తన దగ్గర అంత డబ్బు లేదని ఉమర్ చెప్పాడు. దీంతో కానిస్టేబుల్‌తో బాధితుడిని రక్తం వచ్చేలా కొట్టించాడు ఎస్సై రామ్ చరణ్. గతంలో ఓ స్థలం వివాదంలో కూడా రామ్ చరణ్ డబ్బులు డిమాండ్ చేశాడని ఉమర్ తెలిపాడు. అన్ని విషయాలు మనస్సులో పెట్టుకొని ఎస్సై ఈ దారుణానికి ఒడిగట్టాడని పేర్కొన్నాడు. ఎస్సై నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించారని ఉమర్ విజ్ఞప్తి చేశాడు. బాధితుడు ఉమర్ ప్రస్తుతం రోహిణి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరి ఉన్నతాధికారులు ఎస్సై రామ్ చరణ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

## స్కై ఫౌండేషన్ 283 వ అన్నదానం



**సికింద్రాబాద్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ డైరీ):** హైదరాబాద్ నగరంలో రోడ్ల పక్కన ఫుట్ పాత్ ల మీద ఆకలితో అలమటిస్తూ జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులకు స్కై ఫౌండేషన్ నిర్వాహకులు తమ 283వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఫుట్ పాత్ పై ఉన్న వారికి ఫుడ్ ప్యాకెట్లను అందజేశారు. ప్రతి ఆదివారం తమ కోసం రకరకాల సేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని అనాథలు, నిరాశ్రయులు స్కై కి కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ పావని వాలంటీర్లు పాల్గొన్నారు

# కాకరకాయతో ఎన్నో లాభాలు



కాకరకాయను చాలా మంది పెద్దగా ఇష్టపడరు. ఇది చేదుగా ఉండటమే అందుకు కారణం. అయితే కాకరకాయతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహార నిపుణులు చెబుతున్నారు. కాకరతో కలిగే ప్రయోజనాలు తెలిస్తే మాత్రం అస్సలు వదిలి పెట్టరని నిపుణులు చెబుతున్నారు. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కాకరకాయ దివ్యౌషధంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాకకరాయను రెగ్యులర్‌గా ఆహారంలో భాగం చేసుకుంటే కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

కాకరకాయను డయాబెటిస్ పేషెంట్స్ వరంలాంటిదని చెబుతుంటారు. ఇందులోని చరాంతిన్ అనే నేచురల్ స్టెరాయిడ్ ఉంటుంది. ఇది రక్తంలో షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతారు. క్లోమగ్రంథి ఇన్సులిన్‌ను సరిగ్గా ఉత్పత్తి చేసేలా చేస్తాయి. దీని వల్ల రక్తంలో ఉన్న షుగర్ లెవల్స్ తగ్గుతాయి. కాబట్టి షుగర్ పేషెంట్స్ వారంలో ఒక్కసారైనా కచ్చితంగా కాకరకాయను ఆహారంలో భాగం చేసుకోవాలని చెబుతుంటారు. జ్యూస్ రూపంలో తీసుకుంటే మరింత మెరుగైన ఫలితాలు ఉంటాయి.






ఇక కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా కాకరకాయ బాగా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఉండే ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్)ను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. దీంతో హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు భారీగా తగ్గుతాయి. గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె సమస్యలున్న వారు, గుండె వ్యాధుల నుంచి కోలుకున్న వారు కచ్చితంగా కాకరకాయను ఆహారంలో భాగం చేసుకోవాలి.

కాకరకాయలో బి కాంప్లెక్స్ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల ఈ విటమిన్ల లోపాన్ని జయించవచ్చు. ఇక కాకరకాయను జ్యూస్ రూపంలో తీసుకుంటే.. కిడ్నీల్లో ఉండే వ్యర్థాలు తొలగిపోతాయి. కిడ్నీల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కాకరకాయ ఎంతో తోడ్పడుతుంది. మూత్రాశయ ఇన్ఫెక్షన్లను దూరం చేయడంలో కూడా కాకరకాయ ఉపయోగపడుతుంది.

కాకరయను రెగ్యులర్‌గా ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల లివర్ ఆరోగ్యం మెరుగవుతుందని నిపుణులు చెబుతుంటారు. ఇందులోని ఔషధ గుణాలు లివర్‌లోని వ్యర్థాలు బయటకు పంపించడంలో తోడ్పడుతాయి. అలాగే జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేయడంలో కూడా కాకరకాయ బెస్ట్ ఆప్షన్‌గా నిపుణులు చెబుతుంటారు.






# ప్రొటీన్ దోశ.. ఇలా ట్రై చేయండి

హెల్దీ అండ్ టెస్టీ

ఇంట్లో దోశ ప్రియులు చాలా మంది ఉన్నారా? రోజుకి ఒక్కసారైనా ఇంట్లోనే దోశ చేసుకుంటారా? అయితే ఎప్పుడూ ఒకే రకమైన దోశ తిని బోర్ కొడుతుందా? కొంచెం పోషక విలువలు కలిగిన దోశను ఇంట్లోనే తయారు చేసుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఒకసారి ఈ ప్రొటీన్ దోశ చేసుకోండి. దీనిని శెనగపప్పుతో తయారు చేస్తారు. శెనగపప్పులో ఎక్కువగా ప్రోటీన్ ఉంటుంది కాబట్టి దానిని ప్రోటీన్ దోశ అని పిలుస్తుంటారు. ఈ దోశ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. అలాగే శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తుంది. ఈ ప్రోటీన్ దోశ ఎలా తయారు చేసుకోవాలి దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

అవసరమైన పదార్థాలు:

| | |
|---|---|
| పప్పు | 1 కప్పు |
| కరివేపాకు | 1 కట్ట |
| మిరపకాయలు | 1 |
| అల్లం | 1 అంగుళం |
| జీలకర్ర | 1 టేబుల్ స్పూన్ |
| ఉప్పు | 1 టీస్పూన్ |
| నీరు | 1 కప్పు |










## రెసిపీ

ముందుగా పప్పును కడిగి కనీసం 8 గంటల పాటు నానబెట్టాలి. 8 గంటల తర్వాత పప్పును మిక్సీ జార్‌లో వేసి కరివేపాకు, జీలకర్ర, అల్లం, రుచికి సరిపడా ఉప్పు వేసి కొద్దిగా నీళ్లు పోసి బాగా రుబ్బుకోవాలి. తర్వాత మైదా పిండిని ఒక గిన్నెలో పోయాలి. అందులో దోశ పిండి వేసుకోవాలి. పిండి మరీ చిక్కగా ఉంటే పిండిలో కొంచెం నీళ్లు పోసి కలుపుకోవాలి. ఇప్పుడు అందులో సన్నగా తరిగిన కొత్తిమీర, ఇంగువ పొడి వేసి బాగా కలపాలి. చివరగా దోశ పెనంను స్టవ్ మీద పెట్టి.. పెనం వేడయ్యాక పెనంపై నూనె పోసి.. దోశలు వేసుకుంటే ఎంతో రుచికరమైన ప్రోటీన్ దోశ సిద్ధమైనట్లే. ఇది తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది.

# నకిలీ ప్రొటీన్ పౌడర్ ను ఇలా గుర్తించండి





ప్రొటీన్ పౌడర్ అనేది ఇప్పుడు అందరూ వాడుతున్నారు. ఆరోగ్యానికి సంబంధించి అవగాహన పెరిగిపోయాక.. చాలా మంది ప్రొటిన్, కార్బోహైడ్రేట్స్, ఫైబర్, విటమిన్, మినరల్స్ ఉన్న ఫుడ్ సమపాళ్లల్లో తీసుకుంటున్నారు. అందులో భాగంగా శరీరానికి సరిపడా ప్రొటీన్ అందడం లేదన్న ఉద్దేశ్యంతో చాలా మంది బయట మార్కెట్ లో దొరికే ప్రొటీన్ పౌడర్ వాడుతున్నారు. అయితే ప్రొటీన్ పౌడర్ ముసుగులో కొన్ని నకిలీ ప్రొటీన్ పౌడర్లు కూడా మార్కెట్ లోకి వచ్చాయి. మరి వాటిలో ఏది మంచిది? ఏది నకిలీది? అన్నది ఈ కథనంలో తెలుసుకుందాం.

ప్రోటీన్ పౌడర్ అనేది కండరాల నిర్మాణానికి, బరువు తగ్గడానికి, శక్తి స్థాయిలను పెంచడానికి ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, మార్కెట్‌లో లభించే ప్రోటీన్ పౌడర్‌ల ఖరీదు ఎక్కువ. అంతే కాకుండా వాటిలో ప్రిజర్వేటివ్‌లు, కృత్రిమ రుచులు, చక్కెర వంటి పదార్థాలను కలుపి ఉండొచ్చు. అంతే కాకుండా.. ప్రస్తుతం నకిలీ ప్రోటీన్ పౌడర్లు మర్కెట్లోకి వచ్చాయి. వాటిని కొని యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. కొన్ని టిప్స్ ద్వారా వాటిని గుర్తించవచ్చు. అవేంటో ఇప్పుడు చూద్దాం...



## ప్రోటీన్ పౌడర్ సప్లిమెంట్‌ను జాగ్రత్తలు పాటించండి.

నకిలీ ప్రొటీన్ పౌడర్‌లు అసలైన ఉత్పత్తులతో పోలిస్తే ఆకృతి, రంగులో అసమానతలు కలిగి ఉండవచ్చు. పౌడర్‌లో ఏదైనా గడ్డలు, రంగు మారడంలాంటివి ఉంటే చూడండి. వాటిని కొనుగోలు చేసేటప్పుడు ప్యాకేజీపై స్పెల్లింగ్ మిస్టేక్స్, ప్యాకేజింగ్ డిజైన్, లేబుల్ సమాచారం కచ్చితంగా చూడాలి. పొడి వాసనపై శ్రద్ధ వహించండి. కొన్ని ప్రొటీన్ సప్లిమెంట్లు ప్రత్యేకమైన వాసన కలిగి ఉండగా.. మరికొన్ని అధ్వానంగా ఉంటాయి. అసహ్యకరమైన వాసన కలుషితాన్ని సూచిస్తుంది. పౌడర్ చెడిపోయిందని సూచిస్తుంది. కొందరు బ్రాండెడ్ కంపెనీలకు డుప్లికేట్ చేస్తారు. మంచి ఉత్పత్తులు సాధారణంగా ప్రొఫెషనల్ ప్యాకేజింగ్, కచ్చితమైన లేబులింగ్ కలిగి ఉంటాయి. తయారీదారు పేరు, చిరునామా, సంప్రదింపు సమాచారం కోసం లేబుల్‌ని తనిఖీ చేయండి.

అసలైన ఉత్పత్తులు సప్లిమెంట్ వెనుక ఉన్న కంపెనీ గురించి స్పష్టమైన వివరాలను అందిస్తాయి. ప్యాకేజింగ్‌పై ఈ సర్టిఫికేషన్ బాడీల సీల్స్ లేదా లోగోలు చూడండి. అయితే నకిలీ బ్రాండ్‌లు కొన్నిసార్లు ఈ లేబుల్‌లను కాపీ చేయవచ్చని గుర్తుంచుకోండి. వీలైతే కంపెనీ వెబ్‌సైట్ ద్వారా సర్టిఫికేట్ ప్రామాణికతను కన్ఫామ్ చేసుకోండి. ముఖ్యంగా ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు, అనధికారిక వెబ్‌సైట్‌ల నుండి ప్రొటీన్ పౌడర్‌ను కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండండి. నకిలీ ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా ఉండటానికి పంపిణీదారుల నుండి కొనుగోలు చేయండి.




# అందుకే ఆ అవకాశం తిరస్కరించా

నటులెవరైనా ఓ పాత్రతో విశేష క్రేజ్ సొంతం చేసుకుంటే.. తదుపరి సినిమాల్లోనూ అలాంటి క్యారెక్టర్లే దక్కుతుంటాయి. 33 ఏళ్ల మలయాళ నటి శ్వాసిక పరిస్థితీ ఇదే. తమిళ సినిమా 'లబ్బర్ పందు'లో హీరోయిన్ తల్లిగా నటించి, అలరించింది. దీంతో చాలామంది దర్శకులు మదర్ రోల్స్ ఆఫర్ చేస్తున్నారని, తల్లిగా నటించే ఆసక్తి లేకే 'పెద్ది'ని తిరస్కరించానని శ్వాసిక ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. "ఒకవేళ 'పెద్ది'లో హీరోకు తల్లిగా నటిస్తే కెరీర్ ఎలా ఉంటుందో నాకు తెలియదు. ప్రస్తుతానికి అలాంటి రోల్స్ చేయాలని లేదు. భవిష్యత్తులో ఇలాంటి అవకాశం వస్తే ఆలోచిస్తా" అని పేర్కొంది.

శ్వాసిక తెలుగు ప్రేక్షకులకు పరిచయమే. జులైలో విడుదలైన నితిన్ 'తమ్ముడు' మూవీలో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రతో ఆకట్టుకుంది. రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రమే 'పెద్ది'. క్రీడా నేపథ్య కథతో తెరకెక్కుతోంది. కన్నడ ప్రముఖ నటుడు శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా విడుదల కానుంది.





# బాక్సాఫీస్‌పై 'మహావతార్ నరసింహ' విధ్వంసం




హిందూ పురాణాల నేపథ్యంతో రూపొందిన యానిమేటెడ్ చిత్రం 'మహావతార్ నరసింహ' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. కన్నడలో అగ్ర నిర్మాణ సంస్థ అయిన హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం భారతీయ బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా కన్నడతో పాటు తెలుగులో కూడా మంచి వసూళ్లు రాబట్టింది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం 278 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసి, యానిమేటెడ్ చిత్రాల చరిత్రలో సరికొత్త రికార్డును నెలకొల్పింది. హోంబలే ఫిల్మ్స్, క్లీమ్ ప్రొడక్షన్స్ కలిసి నిర్మించిన ఈ చిత్రం జూలై 25న విడుదలైంది. హిందూ పురాణాలలోని శ్రీమహావిష్ణువు దశావతారాలను ఆధారంగా చేసుకుని ఏడు భాగాలుగా రూపొందించే 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'లో ఇది మొదటి భాగం. ఈ చిత్రానికి అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ భారీ విజయం యానిమేటెడ్ చిత్రాలకు భారతదేశంలో మంచి భవిష్యత్తు ఉందని నిరూపించింది.

# సుందరి పాత్రపై ట్రోల్స్.. స్పందించిన జాన్వీ కపూర్

జాన్వీ కపూర్ నటించిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ మూవీ 'పరమ్ సుందరి'. ఈ సినిమా ట్రైలర్ విడుదల అనంతరం జాన్వీపై నెట్టింట ట్రోల్స్ వచ్చాయి. ఉత్తరాదికి చెందిన ఆమెను మలయాళ యువతిగా చూపించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేరళ బ్యాక్‌డ్రాప్ చిత్రంలో నటించేందుకు మలయాళ హీరోయిన్స్ లేరా? అంటూ గాయని పవిత్రా మేనన్‌లాంటి వారు ప్రశ్నించారు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో జాన్వీ వాటిపై స్పందించారు.

"అవును నేను మలయాళ అమ్మాయిని కాదు. మా అమ్మ (శ్రీదేవి) కూడా మలయాళీ కాదు. కానీ, కేరళ సంస్కృతి పట్ల నేనెప్పుడూ ఆసక్తి చూపిస్తా. ముఖ్యంగా మలయాళ సినిమాలకు నేను అభిమానిని. 'పరమ్ సుందరి'లో నేను మలయాళ అమ్మాయిగానే కాదు తమిళ అమ్మాయిగానూ కనిపిస్తా. ఇది వినోదాత్మక కథ. ఈ సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉంది" అని జాన్వీ పేర్కొన్నారు.

కేరళ యువతి, దిల్లీ యువకుడి ప్రేమకథే ఈ 'పరమ్ సుందరి'. సిద్ధార్థ్ మల్హోత్రా హీరో. సుందరి దామోదరం పిళ్లైగా జాన్వీ, పరమ్ సచ్‌దేవ్‌గా సిద్ధార్థ్ నటించారు. తుషార్ జలోటా దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. "కేరళ.. మలయాళం మోహన్ లాల్, తమిళనాడు.. తమిళ్ రజనీకాంత్, ఆంధ్ర.. తెలుగు అల్లు అర్జున్, కర్ణాటక.. కన్నడ యష్" అంటూ జాన్వీ చెప్పిన డైలాగ్‌లు ట్రైలర్‌లో హైలైట్.





# షాకింగ్ డెసిషన్ తీసుకున్న తమన్నా

తమన్నా భాటియా గురించి పెద్దగా పరిచయం అవసరం లేదు. శ్రీ, హ్యాపీడేస్‌లాంటి చిన్న సినిమాల్లో నటించి అందరినీ ఆకట్టుకున్నది. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే బడా హీరోలందరితో నటించి అగ్రహీరోయిన్‌గా ఎదిగింది. దశాబ్దంపైగా దక్షిణాది ప్రేక్షకులను తన అందచందాలు, అభినయంతో మెప్పించింది ఈ మిల్కీ బ్యూటీ. కొంతకాలంగా దక్షిణాదిలో అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్‌పై దృష్టి పెట్టింది. ప్రస్తుతం పలు చిత్రాల్లో ప్రత్యేక గీతాల్లో కనిపించింది. తాజాగా తన కెరీర్‌లోనే తొలిసారిగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ప్రముఖ హారర్ బోల్డ్ ఫ్రాంచైజీ 'రాగిణి MMS' సిరీస్‌లో హీరోయిన్‌గా ఎంపికైందని సమాచారం. ఫిలిం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్న వార్త ప్రకారం.. ఈ హారర్‌థ్రిల్లర్ ప్రాజెక్ట్ కోసం 'ఏక్తా కపూర్' స్వయంగా తమన్నాను సంప్రదించారట. కథ, పాత్ర, అన్నీ విన్న తర్వాత తమన్నా ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తున్నది.

ఈ పాత్రలో కొంత బోల్డ్ కంటెంట్ ఉండబోతుందని.. తమన్నా తన కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధమైనట్లు టాక్ నడుస్తున్నది. 'జైలర్'లోని ప్రత్యేక గీతం ద్వారా మాస్ అటెన్షన్ అందుకున్న మిల్కీ బ్యూటీ.. 'లస్ట్ స్టోరీస్ 2'లో బోల్డ్ పాత్రతో అభిమానులకు షాక్ ఇచ్చింది. తాజాగా 'రాగిణి MMS 3' వంటి హార్డ్‌కోర్ హారర్‌గ్లామర్ ప్రాజెక్ట్‌ను ఒప్పుకోవడం కెరీర్‌ను మలుపుతిప్పే సాహసోపేతమైన నిర్ణయంగా పేర్కొంటున్నారు. ఇంతకు ముందు రాగిణి సిరీస్‌లో సన్నీ లియోని నటించింది. ఇందులో సన్నీ నటనతో పాటు 'బేబీ డాల్' పాట సంచలనం సృష్టించింది. ఇప్పుడు అదే ఫ్రాంచైజీలో తమన్నా అడుగుపెడుతున్న నేపథ్యంలో ప్రేక్షకులు సహజంగానే భారీ అంచనాలు నెలకొన్నాయి. తమన్నా.. సన్నీ స్థాయికి చేరుతుందా? కొత్తగా ట్రెండ్ సెట్ చేస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది. అయితే, ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడలేదు. సమాచారం మేరకు.. నిర్మాతలతో చర్చలు సాగుతున్నాయని టాక్. ఇదే జరిగితే, తమన్నా బాలీవుడ్ కెరీర్‌లో మైలురాయి నిలుస్తుందని పేర్కొంటున్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465